RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 64

గురువారం 04-07-2024

పేజీలు :04 వెల:రూ.2.00

## అవాస్తవాలను నమ్మవద్దు

### భక్తులకు టిటిడి విజ్ఞప్తి

తిరుమల శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాలు సేంద్రియ బియ్యం వాడకాన్ని నిలిపివేసి గతంలో వినియోగించే బియ్యాన్ని వాడాలని టీటీడీ నిర్ణయించిందని, అదేవిధంగా అన్నప్రసాదాల దిట్టంకూడా పెంచాలని టీటీడీ నిర్ణయించిందని సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతున్నది ఇది పూర్తిగా అసత్యం.టీటీడీ ఈవో శ్రీ జె శ్యామల రావు మొన్న అర్చక స్వాములతో, ఆలయ అధికారులతో సమావేశమై స్వామివారికి నివేదించే అన్న ప్రసాదాల గురించి, వాటి దిట్టం గురించి సుదీర్ఘంగా చర్చించారు. అంతేతప్ప వీటిపై ఎటువంటి నిర్ణయము తీసుకోలేదు.అయితే కొంతమంది సోషల్ మీడియాలో శ్రీవారి ఆలయంలో అన్నప్రసాదాలు తయారీలో మార్పులు చేశారంటూ, దిట్టం పెంచినట్టు పుకార్లు సృష్టిస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. ఇటువంటి అవాస్తవ వార్తలు నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# రాజ్యసభలో ఇండియా కూటమి పార్టీల వాకౌట్



న్యూఢిల్లీ : బుధవారం రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తుండగా జోక్యానికి ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఒపి) మల్లికార్జున్ ఖర్గేకు అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి పార్టీలు సభలో నుంచి వాకౌట్ చేశాయి. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇస్తుండగా ఎల్ఒపి ఖర్గే జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. కానీ ఖర్గే విజ్ఞప్తులను చైర్మన్ జగ్దీప్ ధన్ఖర్ తిరస్కరించారు. దీనితో ఇండియా కూటమి ఎంపిలు నినాదాలు చేస్తూ, ఎల్ఒపి ఖర్గేని మాట్లాడనివ్వాలని కోరారు. వారి నినాదాల మధ్య మోడీ తన ప్రసంగం కొనసాగించారు. ఇది కొంత సేపు కొనసాగింది. తనను మాట్లాడనివ్వాలని ఖర్గే పదే పదే అభ్యర్థించారు.ఖర్గేకు ఎట్టకేలకు అనుమతి లభించినప్పుడు ఇండియా కూటమి ఎంపిలు సభలో నుంచి వాకౌట్ చేశారు.

### ప్రధాని మోడీ ప్రసంగం మధ్యలో వారి నిరసన
### మోడీ మాట్లాడుతుండగా ప్రతిపక్షాల నినాదాల హోరు
### వాకౌట్‌ను నిరసించిన సభ చైర్మన్ ధన్‌ఖర్
### రాజ్యసభ నిరవధిక వాయిదా

వారి వాకౌట్‌ను ధన్‌ఖర్ ఖండించారు. అది రాజ్యాంగానికి అవమానకరం అని ఆయన అన్నారు. మోడీ కూడా వారి వాకౌట్‌ను గర్హించారు. తాను స్వప్రయోజనం కోసం ప్రయత్నించడం లేదని, కానీ తన ప్రభుత్వ పని తీరును వివరించడం తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానాన్ని రాజ్యసభ ఆమోదించిన అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. జూన్ 27న మొదలైన రాజ్యసభ 264వ సెషన్ ధన్యవాదాల తీర్మానానికి ప్రధాని మోడీ సమాధానం ఇచ్చిన తరువాత తీర్మానాన్ని ఆమోదించిన పిమ్మట సభ వాయిదా పడింది. లోక్‌సభను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసిన విషయం విదితమే.

ప్రతిపక్షం వాకౌట్ 'ప్రమాదకర సంప్రదాయం': ధన్‌ఖర్

ప్రధాని మోడీ సమాధానం ఇస్తున్న సమయంలో వాకౌట్ చేయడం ద్వారా ప్రతిపక్షం 'ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన ప్రమాదకర సంప్రదాయాన్ని' నెలకొల్పిందని రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖర్ బుధవారం విమర్శించారు. సభను నిరవధికంగా వాయిదా వేసే ముందు ధన్‌ఖర్ ముగింపు ఉపన్యాసం ఇస్తూ, సెషన్ సమయంలో సభాధ్యక్షుని వేదిక ముందుకు ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే రావడం 'పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని కూడా ధన్‌ఖర్ వ్యాఖ్యానించారు. సెషన్ కార్యక్రమాలపై చైర్మన్ వివరణ ఇస్తూ, అధికార పక్షం, ప్రతిపక్షం నుంచి సభ్యులు చురుకుగా పాల్గొనగా, కొన్ని వ్యాఖ్యలు 'కార్యకలాపాలను దెబ్బ తీసిన అంతరాయాలు నన్ను బాగా కలచివేశాయి' అని చెప్పారు. 'అనుభవజ్ఞులైన సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం ముఖ్యంగా బాధాకరం. అంతరాయం ముందు పేర్కొన్న కార్యకలాపాలను అడ్డుకోవడమే కాకుండా ఈ ప్రసిద్ధ వ్యవస్థ ప్రతిష్ఠను కూడా దెబ్బ తీస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు. ఖర్గే శుక్రవారం రాజ్యసభ వెల్‌లోకి ప్రవేశించడాన్ని ధన్‌ఖర్ ప్రస్తావిస్తూ, 'తుదకు ప్రతిపక్ష నాయకుడు కూడా సభ వెల్‌లోకి రావడం ఎంతైనా బాధాకరం. అది పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని పేర్కొన్నారు. 'ఈ సభ సమాలోచనలు, చర్చలు, సంభాషణల ఆలయం కావడానికి వీలుగా సభ్యులు తమ ప్రవర్తనను చూపాలి' అని ఆయన కోరారు. 'ఇప్పుడు వారి వాకౌట్ తీవ్ర బాధాకరం, ఇది చారిత్రక సందర్భం. ప్రభుత్వం మూడవ టెర్మ్‌లో ఉంది. ప్రధాని ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వానికి వరుసగా సారథ్యం వహిస్తున్నారు. వారు తమ రాజ్యాంగ బాధ్యతల నుంచి వాకౌట్ చేశారు. అది ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమైన ప్రమాదకర సంప్రదాయాన్ని నెలకొల్పింది'

# మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : మోదీ



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాజ్యసభలో బదులిచ్చారు. విపక్షాల నిరసనల మధ్య ప్రధాని తన ప్రసంగం కొనసాగించారు. రాబోయే ఐదేండ్లలో పేదరికంపై పోరాటంలో విజయం సాధిస్తామని చెప్పారు. గత పదేండ్ల అనుభవాలతో తాను ఈ మాట చెబుతున్నానని అన్నారు. ఈ ఐదేండ్లలో మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే నాటికి ఆ ప్రభావం అన్ని రంగాలపై ఉంటుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కాంగ్రెస్ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. 140 కోట్ల మంది ప్రజలను విపక్షాలు అవమానిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే తనలాంటి వారు పార్లమెంట్ వరకూ రాగలిగారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ. 60000 కోట్ల వరకూ రైతుల రుణాలు మాఫీ చేసినా లబ్ధిదారుల జాబితాలో చిన్న, సన్నకారు రైతుల పేర్లు చేర్చలేదని ఆరోపించారు.రాజ్యసభలో ప్రధాని ప్రసంగానికి విపక్షాలు అడుగడుగు నా అడ్డుతగిలాయి. విపక్ష నేత మాట్లాడేం దుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు గందరగోళం సృష్టించారు. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేస్తూ ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలారు. పాలక పక్ష తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.విపక్షాలు ఎగువ సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. సభను విపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

# మెగా డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్..

### కీలక నిర్ణయం తీసుకున్న ఏపీ సర్కార్!

ఏపీలో టీచర్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఇవ్వాలన్న అభ్యర్థుల వినతిపై ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. టెట్‌కు 90 రోజులు, డీఎస్సీకి 90 రోజులు సమయం ఇవ్వాలని నిర్ణయించింది.టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలని విద్యార్థి, యువజన సంఘాలు ముందు నుంచి సమయం అడుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ సంఘాల నేతలు ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన నారా లోకేశ్.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల వినతిని




పరిగణలోకి తీసుకుని.. టెట్, మెగా డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. టెట్‌కు 90 రోజులు, డీఎస్సీకి 90 రోజుల సమయం ఇస్తూ.. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా కొత్త పరీక్ష తేదీలను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రకటించనుంది. కాగా, కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జగన్ ప్రభుత్వం 6100 పోస్టులతో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. అయితే రద్దయిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారికి మెగా డీఎస్సీలో ఫీజు మినహాయింపు ఇవ్వాలని మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు. వారి నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా, ఎలాంటి విమర్శలు తావులేకుండా మెగా డీఎస్సీని పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## పోలవరంలో ముగిసిన విదేశీ నిపుణుల బృందం పర్యటన.. త్వరలోనే సమగ్ర నివేదిక

పోలవరంలో విదేశీ నిపుణుల కమిటీ పర్యటన ముగిసింది. పర్యటన చివరి రోజు స్థానిక రైతులు నిపుణుల కమిటీని కలిసి పోలవరం ఆవశ్యకతను వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సమస్యలపై అధ్యయనం చేసేందుకు ముందుకు వచ్చిన బృందాన్ని రైతులు అభినందించారు.పోలవరం ప్రాజెక్టును 4 రోజుల పాటును విదేశీ నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. తొలి రోజు అప్పర్ కాపర్ డ్యాం, లోయర్ కాపర్ డ్యాం, స్పిల్ వేలను నిపుణులు పరిశీలించారు. రెండో రోజు డయాఫ్రం వాల్, ఈసీఆర్‌యఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతాలను నిపుణుల బృందం పరిశీలించింది. డయాఫ్రం వాల్‌పై అనుమానం వచ్చిన ప్రతి చోటా కాంక్రీట్, మట్టి నమూనాలు సేకరించారు. ఇంజనీరింగ్ పరికరాల ద్వారా డయాఫ్రం వాల్‌ను లోతుగా చెక్ చేసి వాస్తవ పరిస్థితిపై రిపోర్ట్ రెడీ చేయనున్నారు. అలాగే కేంద్ర జలవనరుల శాఖ అధికారుల అనుమానాలు, ప్రశ్నలకు కూడా సమాధానాలు ఇచ్చారు. కాంక్రీట్, మట్టి నమూనాలు సేకరించిన నిపుణులు.. కేంద్ర, రాష్ట్ర అధికారులకు నిపుణుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.బంకమట్టిపై ఎక్కడైనా నిర్మాణాలు చేపట్టాల్సి వస్తే పటిష్టంగా ఉంటుందా లేదా అనే విషయంపైనా క్లారిటీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలకు కూడా ఎటువంటి ఢోకా ఉండదని తెలిపారు. నాలుగు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టును అధ్యయనం చేసిన బృందం కూడా టెక్నికల్ టీమ్ పోలవరాన్ని త్వరలోనే పీపీఏకు రిపోర్ట్ ఇవ్వబోతోంది.

# అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేసిన ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం అమరావతి రాజధానిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్రం పునర్నిర్మాణం కోసం కేంద్రంతో అన్ని విషయాలు చర్చిస్తానని తెలిపారు. అమరావతి పనులు వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఉండాలని కమిటీ చెప్పిన మీదట అమరావతికి శంఖుస్థాపన చేపట్టి, పనులను ప్రారంభించామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద భూసేకరణ ప్రాజెక్టు అమరావతని పేర్కొన్నారు. 29వేల మంది రైతులు 34,400 ఎకరాలు అమరావతి కోసం భూములిచ్చారని,తెలిపారు. రైతులు ఇచ్చిన భూమికి ఏటా పరిహారం ఇచ్చామని అన్నారు.జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ అరాచక పనుల వల్ల అమరావతి ధ్వంసమైందని పేర్కొన్నారు. అమరావతిలో భవనాలు, నిర్మాణ సామగ్రి పాడయ్యాయని అన్నారు. జగన్‌పై నమ్మకం లేక పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోయారని, అమరావతి నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతిని నిర్మించి ఉపాధి కల్పన, సంపదను సృష్టించి, పేదరక నిర్మూలనే ధ్యేయంగా ముందుకు సాగుతామని చంద్రబాబు అన్నారు.

# పిఠాపురంలో మూడెకరాలు కొన్నా.. ఇప్పుడు నేను ఇక్కడి వాస్తవ్యుడినే.. వైసీపీ నేతలకు పవన్ కల్యాణ్ కౌంటర్



తనను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని వైసీపీ నేతలు అన్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన విజయంతో అసెంబ్లీ గేటు తాకడం కాదు.. గేటు బద్ధలు కొట్టుకుని అసెంబ్లీలోకి వెళ్లామని పేర్కొన్నారు. కాకినాడ పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఉప్పాడలో నిర్వహించిన వారాహి బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల సమక్షంలో ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. 2019లో జనసేన ఉనికి నిలబెట్టారని.. 2024లో గుర్తింపు ఇచ్చారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో ఎవరూ ఊహించని ఘన విజయం అందించారని తెలిపారు. దానికి పిఠాపురం నుంచే బీజం పడిందని అన్నారు. పిఠాపురం ఇచ్చిన బలం దేశ రాజకీయాల్లో మాట్లాడుకునేలా చేసిందని తెలిపారు. వంద శాతం స్ట్రయిక్ రేటు విజయం మామూలు విషయం కాదని అభిప్రాయపడ్డారు. కావాలనే తాను పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నానని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేగా ప్రజల ముందు ప్రమాణం చేశారు. అన్ని వర్గాలు, మతాలు, కులాల వారీగా హామీ ఇస్తున్నా.. మానవత్వాన్ని కాపాడుతా.. మీ అభ్యున్నతికి కష్టపడతా.. లంచాలు తీసుకుని పాలన మీకు అందిస్తా అని పవన్ కల్యాణ్ ప్రజల ముందు ప్రమాణం చేశారు.పవన్ కల్యాణ్ ఆంధ్రాలో ఉండరని వైసీపీ నేతలు చేసిన విమర్శలను పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇప్పుడు తాను పిఠాపురం వాస్తవ్యుడిగా మారానని కౌంటర్ ఇచ్చారు.. పిఠాపురంలో మూడెకరాల భూమి కొన్నానని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులను గౌరవిస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులంతా అధికారులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా పార్టీపరంగా వారిపై దౌర్జన్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తిరుమల ప్రక్షాళన షురూ..

### దళారీ వ్యవస్థను అరికట్టేలా టీటీడీ యాక్షన్ ప్లాన్..!

తిరుమలలో యాక్షన్ షురూ అయింది. స్పెషల్ దర్శనాల టికెట్ల దందాకు చెక్ పెట్టేలా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపట్టింది. ఆన్‌లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్ లింక్ చేస్తూ ఈవో నిర్ణయం తీసుకున్నారు.ఈ క్రమంలోనే శ్రీవారి భక్తులను మోసగిస్తున్న దళారులపై టీటీడీ కొరడా ఝులిపించే చర్యలకు సిద్ధమైంది. దళారులను కనిపెట్టి ఎప్పటికప్పుడు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో జిల్లా ఎస్పీ తోపాటు పోలీస్ అధికారులు, టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఏపీ సీఎం చంద్రబాబు చెప్పినట్లు రాష్ట్రంలో తిరుమల నుంచే ప్రక్షాళన మొదలైంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో చోటు చేసుకున్న అక్రమాలపై టీటీడీ చర్యలు చేపట్టింది. తిరుమలలో దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు టీటీడీ చర్యలు ప్రారంభించింది. టీటీడీ ఈవోగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జె. శ్యామలరావు.. దీనిపై దృష్టిసారించారు. దళారీలను ఎలా అరికట్టాలనే దానిపై తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో శ్యామలరావు సమీక్ష నిర్వహించారు.తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల అవసరాలు ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడే దళారులపై నిఘా పెంచాలన్నారు. వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి భక్తులను మోసగిస్తున్న దళారులను ఉపేక్షించ వద్దన్నారు ఈఓ. దళారుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ మేరకు అధికారులకు ఈవో కీలక సూచనలు చేశారు. తిరుమలలో దళారులకు సంబంధించి ఆన్ లైన్, లక్కీడిప్ సిస్టం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులు, దొంగతనం కేసులు, మద్యపానం, నకిలీ వెబ్‌సైట్లు తదితర అంశాలకు చెందిన కేసులను సమీక్షించారు.ఏ దశల్లో కేసులు ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీసులు ఈఓ కు వివరించగా మరో వారంలోగా కేసుల్లో ఉన్న దళారులకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలను ఈఓ పోలీసులను కోరారు. కేసులు కూడా సత్వర పరిష్కారం కోసం టీటీడీ విజిలెన్స్, పోలీస్ విభాగాలు తరచూ సమావేశం కావాలన్నారు ఈఓ శ్యామల రావు.అలాగే తిరుమల నడక మార్గాల్లో భక్తుల భద్రతపై టీడీడీ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఇంజనీరింగ్, సెక్యూరిటీ విభాగాలతో టీటీడీ ఈవో శ్యామల రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిటీ ప్రతిపాదనలు, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ టీం చేసిన ప్రతిపాదనలపై ఫారెస్ట్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో కొండకు చేరే భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. చిరుతలు, ఇతర జంతువులు సంచారం తెలుసుకొనేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఇూ ఆదేశించారు. అలాగే, కాలినడక మార్గాల్లో నిర్దేశించిన సమయాల్లోనే భక్తులు తిరుమలకు చేరుకునేలా మార్పులు చేయాలని అధికారులు ఈవో దృష్టికి తీసుకువచ్చారు.

# సంపాదకీయం

గురువారం 04-07-2024

## విభజన సమస్యలు కొలిక్కివచ్చేనా....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం... ఏపీ, తెలంగాణగా విడిపోయి పదేళ్లు దాటిపోయింది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. విభజన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఆస్తుల విభజన, విద్యుత్ బిల్లుల బకాయిలు వంటి అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. విభజన సమస్యల పరిష్కారం అంత సులువు కాదు.తెలుగు రాష్ట్రాల మధ్య పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలే. మొదటి ఐదేళ్లు రాజ్ భవన్ కేంద్రంగా.. గవర్నర్ సమక్షంలో చర్చలు జరిగినా ఒక్క సమస్య పరిష్కరించుకోలేకపోయారు. తర్వాత ఐదేళ్లు అసలు చర్చలే జరగలేదు. పట్టించుకోలేదు. ఇప్పుడు విభజన చట్టానికి పదేళ్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు మారడంతో విభజన సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి ప్రయత్నాలు ప్రారంభించాయి. ఉ ఎలాంటి పరిష్కారానికి వచ్చినా ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి విపక్ష పార్టీలు రెడీగా ఉంటాయి. తెలంగాణ ఆస్తులను ఏపీకి అప్పగించడానికి రేవంత్ రెడ్డి రెడీ అయ్యారని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో విమర్శలు ప్రారంభించేసింది. ఆస్తుల పంపకానికి చట్ట ప్రకారం నిర్ణయం తీసుకున్నా.. ఇలాంటి ప్రచారాల వల్ల రాజకీయంగా నష్టం జరుగుతుందన్న ఉద్దేశంతో ఎలాంటి ముందడుగు వేయలేని పరిస్థితులు ఉన్నాయిఅధికారిక వర్గాల ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో జాబితా చేసిన వివిధ సంస్థలు, కార్పొరేషన్ల విభజన, అనేక అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇంకా పూర్తి కాలేదు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 89 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు తొమ్మిదో షెడ్యూల్‌లో జాబితా చేశారు. చట్టంలోని 10వ షెడ్యూల్‌లో ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఏపీ ఫారెస్ట్ అకాడమీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ,ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ వంటి 107 శిక్షణా సంస్థలు ఉన్నాయి. రిటైర్డ్ బ్యూరోక్రాట్ షీలా భిడే నేతృత్వంలోని నిపుణుల కమిటీ షెడ్యూల్ 9,10 షెడ్యూల్ సంస్థల విభజనపై సిఫార్సులు చేసినప్పటికీ, ఈ అంశం అపరిష్కృతంగానే ఉంది. విభజన తర్వాత విద్యుత్ సరఫరాకు సంబంధించి బకాయిల చెల్లింపు విషయంలో కూడా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు ముందుకు సాగలేదు. అలాగే ప్రభుత్వ ఆధీనంలోని రోడ్డు రవాణా సంస్థ ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు ఒక కొలిక్కి రాలేదు. రాజధాని నగరమైన హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ ఆస్తుల్లో వాటా కావాలని ఏపీ కోరిందని, దానికి టీఎస్ఆర్టీసీ నిరాకరించింది. హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ ఆస్తులు తెలంగాణకు చెందినవేనని . తెలంగాణ గడ్డపై ఉన్న ఆస్తుల్లో ఏపీకి వాటా ఎలా ఇస్తారని తెలంగాణ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం రెండు రాష్ట్రాలకు భూ కేటాయింపులు చేయడంతో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌పై వివాదం సద్దుమణిగింది. విభజన చట్టం ఆధారంగా 58:42 ప్రకారం రెండు రాష్ట్రాలు భవన్ ఆస్తులు పంచుకున్నాయి. అశోకా రోడ్డుతో పాటు శ్రీమంత్ మావరావు సింథియా మార్గ్ లో కలిపి రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగా 19. 733 ఎకరాల భూమి ఉంది. అశోకా రోడ్డులోని 8. 726 ఎకరాల్లో ఏపీ-తెలంగాణ భవన్ ఉంది. ఉమ్మడి భవన్ లో ఏపీ వాటా 4.3885 ఎకరాలు (విలువ రూ.1,703.6 కోట్లు), తెలంగాణ వాటా 4.3375 ఎకరాలు (రూ.1,694.4 కోట్లు)గా ఉంది. 0.511 ఎకరాల రోడ్డులో రెండు రాష్ట్రాలకు చెరో 0.2555 ఎకరాలు (రూ.160 కోట్లు) ఉంది. ప్రస్తుతం తెలంగాణ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.082 ఎకరాలు (రూ.1,614.40 కోట్లు), నర్సింగ్ హాస్టల్ 3. 367 ఎకరాలు (రూ.1,318 కోట్లు) ఉంది. ఏపీ కింద ఉన్న శబరి బ్లాక్ 4.133 ఎకరాలు (రూ.1,623.60 కోట్లు), పటౌడీ హౌస్ లోని 7.640 ఎకరాలు (రూ.2,394 కోట్లు) ఉంది. శ్రీమంత్ మాధవరావు సింథియా మార్గ్ లో 7.640 ఎకరాల విస్తీర్ణంలోని పటౌడీ హౌస్ వేరుగా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తుది పరిష్కారం కోసం వేచి చూస్తున్న సమస్యల్లో ఉద్యోగుల బదిలీ అంశం ఇప్పటికీ తేలలేదు. ఏపీకి కేటాయించిన 144మంది తెలంగాణ ఉద్యోగులు ఇంకా అక్కడే పనిచేస్తున్నారు. వారు తమను తెలంగాణకు పంపాలని కోరుతున్నారు.విభజన సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా జరిగిన ప్రయత్నాలు అంతంత మాత్రమే. 2014లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాయి. ఆస్తుల పంపకానికి అప్పటి గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో రాజ్ భవన్ కేంద్రంగా కొన్ని సమావేశాలు జరిగాయి. కానీ గవర్నర్ తెలంగాణ వైపు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఏపీ ప్రభుత్వం ఆరోపిస్తూ దూరం జరిగింది. పరిపాలన అమరావతికి మార్చుకోవడంతో.. సెక్రటేరియట్ లో ఏపీకి కేటాయించిన భవనాలు ఇవ్వాలని కేసీఆర్ ఒత్తిడి చేశారు. దానికి చంద్రబాబు అంగీకరించలేదు. అన్ని సమస్యలూ ఒకే సారి పరిష్కరించుకుందామన్నారు. తర్వాత ఏపీలో ప్రభుత్వం మారంది. జగన్ సీఎం అయ్యారు. కానీ కేసీఆర్ రెండో సారి సీఎం అయ్యారు. విజయవాడలో జరిగిన జగన్ ప్రమాణ స్వీకార ఉత్సవానికి కేసీఆర్ హాజరయ్యారు. తమ మధ్య బేసిన్లు, బేషజాలు ఉండవని ప్రకటించారు.దీంతో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అనుకున్నారు. కనీ సెక్రటేరియట్ లో ఏపీకి కేటాయించిన భవనాలను తెలంగాణకు ఇచ్చేశారు జగన్. కానీ ఆ తర్వాత ఒక్క విభజన సమస్యపైనా చర్చ జరగలేదు. రాజకీయంగా కేసీఆర్, జగన్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ రాష్ట్ర సమస్యల అంశంపై చర్చించేందుకు ఇరు రాష్ట్రాల సీఎంలు ఆసక్తి చూపలేదు. ఒకరి, రెండు సార్లు సమావేశాలు జరిగినా అవి రాజకీయ కోణంలోనే జరిగాయి .మరి ధైర్యంగా ఇద్దరు నేతలు.. ఓ పరిష్కారానికి వస్తారా లేదా అన్నదే కీలకం. అదే జరిగితే.. మరికొన్ని సమావేశాల తర్వాత అయినా పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయనుకోవచ్చు.

# రఘురామ రూటే వేరు...



ఏలూరు, జూలై 3, కనుమూరి రఘురామకృష్ణరాజు పరిచయం అక్కరలేని పేరు. నరసాపురం ఎంపీగా ఆయన 2019 నుంచి 2023 వరకూ వైసీపీలోనే ఉండి ఆ పార్టీకే కంట్లో నలుసుగా మారారు. ప్రతిరోజూ రచ్చబండ పేరుతో మీడియా సమావేశం పెట్టి మరీ పార్టీపైన, అధినేత జగన్ పైన విమర్శలు చేసే రఘురామకృష్ణరాజు గత ఎన్నికల్లో నరసాపురం టిక్కెట్ ఆశించినా దక్కలేదు. ఆ సీటు కూటమిలో పొత్తులో భాగంగా బీజేపీ ఎగరేసుకుపోయింది. ఇక రాజును కాదనలేక, బయట ఉంచలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సిట్టింగ్ ఎమ్మెల్యేను పక్కన పెట్టి మరీ ఆయనకు ఉండి శాసనసభ టిక్కెట్ ఇచ్చారు. కూటమి ప్రభంజనంతో ఆయన ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు.కూటమి అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి గ్యారంటీ అనుకున్న రఘురామకృష్ణరాజుకు చివరకు నిరాశ ఎదురయింది. ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. స్పీకర్ పదవి అయినా దక్కుతుందని భావించినా అది కూడా అయ్యన్నపాత్రుడికి దక్కింది. దీంతో రఘురామకృష్ణరాజుకు మంత్రివర్గంలో ఇక తనకు స్థానం దక్కదని తేలిపోయింది. అయినా ఆయన ఉండిలో తనకంటూ ప్రత్యేకతను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిధుల పైన ఆధారపడకుండా నిధుల సేకరణను ఆయన సమీకరిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మిగిలిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఇది ఇబ్బంది కరంగా మారింది. రఘురామకృష్ణరాజుకు పారిశ్రామికవేత్తలు, సినీ పెద్దలతో ఉన్న సంబంధాలతో వారంతా నిధులు ఇస్తున్నారు. ఆ నిధులతో ఉండి నియోజకవర్గం అభివృద్ధి చేపట్టేందుకు సిద్ధమయ్యారు.అందులో ఎంత మాత్రం తప్పు లేకపోయినా మిగిలిన ఎమ్మెల్యేలు అలా ఎందుకు చేయకూడదన్న ప్రశ్న ఇప్పుడు అన్ని నియోజకవర్గాల్లో వినపడుతుంది. మిగిలిన ఎమ్మెల్యేలకు ఇది ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ నిధులపై తాను ఆధారపడనని పరోక్షంగా రఘురామకృష్ణరాజు చెప్పదలుచుకున్నారా? అన్న ప్రశ్న కూడా వినపడుతుంది. మరోవైపు రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయి ఉండటం, ఉన్న నిధులు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేస్తుండటంతో ఇక ప్రభుత్వంపై ఆధారపడి ప్రయోజనం లేదనకున్న రాజు గారు తన సొంతంగా నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందనే లభిస్తుండటంతో ఉండి నియోజకవర్గం అభివృద్ధిని తాను సొంతంగానే చేస్తానని ప్రభుత్వానికి పరోక్షంగా సంకేతాలను పంపినట్లయిందన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి.మరోవైపు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూడా రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్లను పంపిణీ చేస్తూ ఇచ్చిన కరపత్రంపై ఎన్టీఆర్ ఫొటో లేకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించడం ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారాయి. వచ్చే నెల పింఛను చెల్లించే సమయంలో ఎన్టీఆర్ ఫొటో పెట్టాలంటూ ఆయన ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఆ కరపత్రంపై కేవలం చంద్రబాబు ఫొటో మాత్రమే ఉండటంతో ఎన్టీఆర్ ఫొటో కూడా ముద్రించాలని పేర్కనడంతో రఘురామకృష్ణరాజు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టే ప్రయత్నం చేశారా? లేక కేవలం మరిచిపోయిన విషయాన్ని గుర్తు చేశారా? అన్న విషయంపై ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.


## ఉద్యోగులకు...ఎన్నాళ్లకు కెన్నాళ్లకు...

విజయవాడ, జూలై 3, ఏపీలో పండుగ వాతావరణం నెలకొంది. పెంచిన పింఛన్ల సొమ్ముతోపాటు మూడు నెలల బకాయిలు కలిపి ఇవ్వడంతో 60 లక్షల మందికి పైగా పింఛన్‌దారులు ఆనందోత్సాహాల్లో మునిగితేలగా...అటు ప్రభుత్వ ఉద్యోగులు, పదవీవిరమణ పొందిన పింఛన్‌దారులు సైతం సంతోషంలో మునిగితేలారు. చాలారోజుల తర్వాత 1వ తారీఖు జీతాలుపడ్డాయోచ్ అంటూ సంబరపడ్డారు. ఏపీలో ఉద్యోగులు పింఛన్‌దారులు సంబరాలు చేసుకుంటున్నారు. ఒకటో తారీఖు వారి ఖాతాల్లో జీతాలుపడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేంటి...జీతాలుపడితే సంబరాలు చేసుకోవడం ఏంటి? పనిచేసిన తర్వాత ప్రభుత్వ సంస్థ అయినా, ప్రైవేట్ సంస్థ అయినా జీతాలు ఇస్తుంది కదా..ఇందులో సంబరపడాల్సిన పని ఏముంది అనుకుంటున్నారా..? పైగా గవర్నమెంట్ ఉద్యోగం అంటే పిడుగులుపడినా నెలఖారు కల్లా వారి జీతం వారికి వస్తుందన్న నానుడి కూడా ఉంది ఇదా..ఇందులో వింత ఏముంది అనుకుంటున్నారా.? అక్కడే ఉంది మరి అసలు కిటుకు.ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు అంటే చాలు ధర్నాలు, సమ్మెలతో పాలక ప్రభుత్వాన్ని గడగడలాడించేవాళ్లు. పెన్‌డౌన్, పెన్‌డ్రైవ్ డౌన్ అంటూ ఉద్యమాన్ని ఉరకలెత్తించేవాళ్లు. ఉద్యోగులు రోడ్డెక్కారంటే పాలక గుండెల్లో రైళ్లు పరుగులెత్తేవి. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా వారి యూనిటీ..బలమైన ఉద్యోగసంఘాలకు తోడు..ప్రజలతో ఎక్కువగా మమేకమై ఉండేది వాళ్లే కాబట్టి ఐదేళ్ల తర్వాత తమ పార్టీకి ఎక్కడ ఎసరు తెస్తారోనన్న భయం ఉండేది. కానీ గడిచిన ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో అటు జగన్మోహన్‌రెడ్డిగానీ, ఇటు కేసీఆర్గానీ ఉద్యోగ సంఘాల కోరలు పీకేశారు. ఉద్యోగులను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. జీతాలు పెంచమని అడిగే ధైర్యం కాదు కాద...నెలనెల జీతాలు ఇస్తే చాలురా దేవుడా అన్నంత పని చేశారు.ఉద్యోగులు బకాయిలు, డీఏలు, ఫిట్‌మెంట్ దేనిపైనా ఉద్యోగులు నోరెత్తే సాహసం చేయలేదు. ప్రతినెల మొదటి తారీఖు రావాల్సిన జీతం కూడా దాదాపు 20వ తారీఖు తర్వాత వచ్చిన సందర్భాలు ఎక్కువే. ప్రభుత్వం ఎప్పుడు జీతం ఇస్తే అప్పుడు తీసుకోవాల్సిందేనన్న పరిస్థితులు కల్పించారు. ఒక్కోసారి రెండోనెలలో కూడా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈఎంఐలు కట్టాలని వేడుకున్నా...పాలబిల్లు, సరకులు తెచ్చుకోవాలని ప్రాథేయపడినా వైసీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పెద్దపెద్ద జీతాలు వచ్చేవారి సంగతి సరే...కానీ కేవలం నెలజీతం మీదే ఆధారపడే బ్రతికే చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలు కోసం తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పడరానివారితో మాటలు పడ్డారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం అంటే గర్వంగా చెప్పుకునే వారు కూడా కిరాణా దుకాణదారుడితోనూ, పాలు, కూరగాయలు అమ్మే వారితోనూ మాటలు పడాల్సి వచ్చింది

.ఏపీలో ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ ఉద్యోగుల బతుకుల్లోనూ మార్పులొచ్చాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో జూన్ 1నే ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లో జీతాల్లో వేశారు. ముఖ్యంగా పదవీవిరమణ పొందిన పింఛన్‌దారుల ఆనందానికి అవధుల్లేవ్..ఇంటి ఖర్చులకు, మందులకు ఇవే వారికి ఆధారం. దాదాపు అందరి ఖాతాల్లో వేతనాలు జమ అయ్యాయి. దాదాపు నాలుగున్నరేళ్ల తర్వాత మొదటి తారీఖు జీతాలు పడటంతో వేతనజీవులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో గాడితప్పిన వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుకుంటూ వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబ..ముందుగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్య పరిష్కరించారు.సామాజిక పింఛన్‌దారులకు నాలుగున్నరవేల కోట్లు...ఉద్యోగుల జీతాలకు ఐదున్నరవేల కోట్ల రూపాయలను ఒకేరోజు ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రభుత్వం వచ్చిన పక్షం రోజుల్లోనే దాదాపు పదివేలకోట్ల రూపాయలు అందజేసింది.

## 5 నుంచి శ్రీ మరిడమ్మ ఉత్సవాలు

కాకినాడ, జూలై 3, జులై 5 నుంచి జరగున్న పెద్దాపురం శ్రీ మరిడమ్మ వారి ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఉత్సవ మహోత్సవానికి రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీమరిడమ్మ వారి దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తున్నారు.మరిడమ్మ ఆషాఢమాసం జాతర మహోత్సవం జూలై 5 నుంచి ఆగస్టు 10 వరకు 37 రోజుల పాటు జరుగుతుంది. జూలై 4 (గురువారం) రాత్రి జాగరణ ఉత్సవంతో జాతర ప్రారంభం అవుతుంది. ప్రధానంగా మంగళవారం, గురువారం, ఆదివారాల్లో భక్తుల తాకిడి భారీగా ఉంటుంది. మిగిలిన రోజుల్లో కాస్త తక్కువగా ఉంటుంది. దాదాపు నెల రోజులకు పైగా జరిగే ఉత్సవం గోదావరి జిల్లాల్లో చాలా విశిష్టత కలిగిన పండగ. ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని నివాసం ఉంటున్న వారు కూడా ఈ ఉత్సవానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.రథంపై శ్రీ మరిడమ్మ వారి దివ్యరూప ఉత్సవమూర్తిని విద్యుద్దీపాలంకరణతో సుందరంగా అలంకరిస్తారు. దేవస్థానం వారి పది గరగలతో గరగల నృత్యం చేస్తారు. శ్రీదేవి గరగ నాట్య బృందం, పేపకాయలపాలెం వారిచే గరగ నాట్యం (మహిళలు) చేస్తారు. సామర్లకోట వారిచే కేరళ డ్రమ్స్ కార్యక్రమం ఉంటుంది. అఘోర వేషాల కార్యక్రమం కూడా ఉంటుంది. నాదస్వరం, తప్పెటగుళ్లు, శూలాల సంబరం, కాళికాదేవి వేషాలు, పొడువుకాళ్లు, బుట్టబొమ్మలు, కాంతారా వంటి కార్యక్రమాలు ఉంటాయి. జాతర సమయంలో అమ్మవారి కాలక్షేప మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.మరిడమ్మ అమ్మవారి మహోత్సవం ప్రతి సంవత్సరం జేష్ఠ మాసంలోని అమావాస్య నుండి ప్రారంభమై ఆషాడమాసంలోని అమావాస్య వరకు వైభవంగా జరుగుతుంది. రాష్ట్ర నలుమూల నుండి మరిడమ్మ అమ్మవారి దర్శనం కోసం ఎంతో మంది భక్తులు వస్తుంటారు. ఒక్క ఆదివారం రోజునే 40 నుండి 50 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. అలాగే మంగళవారం, గురువారాల్లో కూడా భక్తులు భారీగానే వస్తుంటారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకుంటారు.మరిడమ్మ తల్లి దేవాలయం తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ప్రసిద్ధి చెందింది. 1952లో ఈ దేవాలయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. 17వ శతాబ్దంలో పెద్దాపురంలో మానోజి చెరువుకి అతి సమీపంలో శ్రీ మరిడమ్మ అమ్మవారు వెలిశారు. ప్రస్తుతం మరిడమ్మ తల్లి దేవాలయం ఉన్న ప్రదేశమంతా చిట్టడవిగా ఉండేంది. ఒకసారి ఆ అడవిలో పశువుల కాపరులకి 16 ఏళ్ల యువత కనిపించి నేను చింతపల్లి వారి ఆడపడుచుని నేను ఈ ప్రదేశంలో ఉన్నానని మా వాళ్లకు చెప్పండి అని చెప్పి మాయం అయిందని చరిత్ర చెబుతుంది.ఈ వింతను చూసిన పశువుల కాపరులు వెంటనే చింతపల్లి వారికి జరిగిందంతా చెప్పారు. అంతకు ముందే మరిడమ్మ అమ్మవారు చింతపల్లి వారి కలలో కనిపించి, తనకి మానోజీ చెరువు సమీపంలో ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించింది. ఆ చింతపల్లి కుటుంబ సభ్యులు అంతా ఆ మానోజి చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో వారికి పసుపు పూసిన ఒక కర్ర గద్దె అమ్మవారి ప్రతిరూపం దర్శనమిచ్చిందని చెబుతుంటారు. ఈ గద్దెను అక్కడే ప్రతిష్టించి తాటాకు పాక వేసి ఆ నాటి నుండి నిత్య దూప, దీప, నైవేద్యములు చెల్లించి ఆరాధిస్తున్నారు.జ్యేష్ట అమావాస్యకు పక్షం (పదిహేను రోజులు) ముందు అమ్మవారికి ఉయ్యాల తాడి (తాటి చెట్టు)ని వేస్తారు. ఈ ఉత్సవం రోజు నుండి ముగిసే వరకు అమ్మవారు, ఆమె ఆడపడుచులు అక్క చెల్లెళ్లు ఈ ఉయ్యాల తాడి వద్దే ఆడిపాడి భక్తుల ఆలనా పాలనలు చూస్తారని భక్తులు విశ్వాసం. ఈ ఉయ్యాల తాడిని రైతులు వారివారి పొలాల గట్లమీద ఏపుగా ఎదిగిన తాడిని సమర్పించడానికి ముందుకు వస్తారు.అలా రైతులు ఆలయ కమిటీకి ఆరు నెలల ముందుగానే చెప్పుకోవలసి ఉంటుంది. ఉయ్యాల తాడిని కేవలం భూజాల మీద మాత్రవే దాదాపు 100 మంది దళిత సోదరులు ఊరేగింపుగా డప్పుల దరువులతో, నృత్యాలతో దారిపొడువునా గ్రామ ప్రజలు, ఆడపడుచులు తాడిలకు నీళ్లతో కడిగి పసుపు, కుంకుమలు రాసి పాత పెద్దాపురం కోటముందు మీదుగా గుడి వద్దకు సాగనంపుతారు. ఆది వారి భుజాల మీదుగా ఆ దారి మీదుగానే గుడివద్ద రావాలని అనాదిగా వస్తున్న ఆచారం.



## అమరావతిపై టీడీపీ వైట్ పేపర్...

విజయవాడ, జూలై 3, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించుకున్నారు. బుధవారం మొత్తం అమరావతి అంశంపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు.అమరావతిపై తమ ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను కూడా వెల్లడించనున్నారు. దీనికి సంబంధించి అధికారులతో ఇప్పటికే చంద్రబాబు రివ్యూ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి వ్యవహారాలను శ్వేతపత్రంలో ప్రకటించే అవకాశం ఉంది. గతంలో జరిగిన నిర్మాణాలు, పెండింగ్ లో ఉన్న పనులు, ఏయే పనులు ప్రధానంగా డ్యామేజ్ అయ్యాయి.. ఇలాంటి అంశాలను వైట్ పేపర్ లో ఉంటాయి. అమరావతిని నిర్వీర్యం చేసేందుకు జగన్ ప్రభుత్వం చేసిన కుట్రలు, తప్పుడు కేసులు వంటి వివరాలను కూడా వెల్లడించే అవకాశం ఉంది. అమరావతే ఏకైక రాజధాని అని టీడీపీ నినాదం. ఆ నినాదంతోనే ఎన్నికలకు వెళ్లి భారీ విజయం సాధించారు. గెలిచిన వెంటనే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఇప్పటికే చంద్రబాబు అమరావతి ప్రాంతంలో ఓ సారి పర్యటించి రైతులతో మాట్లాడారు. సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూమి ఇంకా కొంత మంది రైతులు ఇవ్వలేదు. వారితో అధికారులు మాట్లాడుతున్నారు. గతంలో నిర్మాణాలకు కాంట్రాక్టులు పొందిన కంపెనీలతో ఒప్పందాలు తీరిపోయాయి. మళ్లీ ఒప్పందాలు చేసుకోవాలా లేకపోతే మళ్లీ టెండర్లు పిలవాలా అన్నదానిపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. నిర్మాణ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. అమరావతిలో మళ్లీ నిర్మాణాలను మరో నెలలో ప్రారంభించాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే 70 నుంచి 90 శాతం వరకూ పూర్తయిన భవనాలను అందుబాటులోకి తీసుకు వస్తే చాలా వరకూ వసతి సమస్య పరిష్కారం అవుతుందని ఉద్యోగులంతా ఒకే చోట నిర్వాసం ఉండే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అదే సమయంలో గతంలో భూములు కేటాయించిన సంస్థలు వెంటనే పనులు ప్రారంభించేలా సంప్రదింపులు జరుపుతున్నారు. చాలా వరకూ భూ కేటాయింపులను జగన్ ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ ఆసక్తి చూపించే సంస్థలకు మళ్లీ కేటాయించే అవకాశం ఉంది. దాదాపుగా అన్ని కంపెనీలు మళ్లీ అమరావతిలో నిర్మాణాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ఇప్పటికే ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్ ల కోసం భూమిని నోటిపై చేశారు. రెండున్నర లేదా మూడేళ్లలో అమరావతి ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్‌లను పూర్తి చేయాలనుకుంటున్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతూండగా.. భూములు వేలం వేసి. నిధులు సమీకరించుకోవాలని అనుకుంటున్నారు. ఇలాంటి ప్రణాళికలు మొత్తాన్ని చంద్రబాబు వివరించే అవకాశం ఉంది.

## సామాజిక వర్గాలను దగ్గరయ్యేందుకు...

కర్నూలు, జూలై 3,ఆంధ్రప్రదేశ్ లో కులాల ప్రస్తావన లేకుండా ఏ ఎన్నిక జరగదు. అందుకు కారణం అక్కడ సామాజికవర్గాలదే అధిక ప్రాధాన్యత. ఒక్కొక్క పార్టీకి ఒక్క కులం అండగా నిలుస్తుంది. టీడీపీకి కమ్మ సామాజికవర్గం, జనసేనకు కాపు కులం, బీజేపీకి వైశ్య, బ్రాహ్మణ కులాలు, వైసీపీకి రెడ్డి సామాజికవర్గాలు అనుకూలమన్నది అందరికీ తెలిసిందే. అయితే మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చూస్తే మాత్రం కూటమి పార్టీలకు కమ్మ, కాపు, వైశ్య, బ్రాహ్మణ వర్గాలు అండగా నిలిచాయి. బీసీలు కూడా ఎక్కువ శాతం మంది మద్దతు పలికినట్లు ఫలితాల తర్వాత తేలింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే రెడ్డి సామాజికవర్గం కూడా ఎక్కువ భాగం కూటమి వైపునకు మొగ్గు చూపారన్నదే ప్రధానమైనది. . అందుకు కారణాలు కూడా లేకపోలేదు. 2019 ఎన్నికల ముందు వరకూ జగన్ వెంటనే రెడ్డి సామాజికవర్గం నడిచింది. వైసీపీ పార్టీ స్థాపించిన నాటి నుంచి అన్ని రకాలుగా జగన్ వెన్నంటే నడిచింది రెడ్డి సామాజికవర్గమే. తమ డబ్బులను ఖర్చు చేసి మరీ 2014, 2019 ఎన్నికల్లో రెడ్డి సామాజికవర్గం నేతలు ఖర్చు పెట్టారు. మనోడు అధికారంలోకి వస్తే బాగుంటుందని భావించారు. అందుకే వారు ఆ రెండు ఎన్నికల్లో కసి కొద్దీ పనిచేశారు. కానీ 2014 ఎన్నికల్లో అది అధికారంలోకి రాలేకపోయింది. అయినా సరే రెడ్డి సామాజికవర్గం నేతలలో 90 శాతం మంది పార్టీకి వెన్నుదన్నుగానే నిలిచారు. జగన్ పాదయాత్ర నుంచి పార్టీ విజయం సాధించేంత వరకూ అంటిపెట్టుకునే ఉన్నారు. అధికారంలోకి రావాలని చెమటోడ్చారు. ఉన్న ఆస్తులను అమ్మి మరీ తమ నియోజకవర్గాల్లో ఖర్చు చేసిన వాళ్లు కూడా అనేక మంది ఉన్నారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు రెడ్డి సామాజికవర్గం నేతలను దూరం పెట్టారు. పదవులన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంటూ కొత్త పల్లవి అందుకుని వారిని వాటిని దక్కకుండా చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ వారికి పెద్దగా ప్రయారిటీ ఇవ్వలేదు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకోవడంలోనే నిమగ్నమయి పార్టీకి బేస్ లాంటి రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. కనీసం వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. దీంతో వాళ్లంతా కసి మీద ఉన్నారు. తాము పదేళ్ల పాటు కష్టపడి, సొంత డబ్బు ఖర్చు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోలేదని మొన్నటి ఎన్నికల్లో రెడ్లు అడ్డం తిరిగారు. దీంతో ఇప్పుడు జగన్ కు తిరిగి సొంత సామాజికవర్గాన్ని దగ్గర చేర్చుకోవడం పెద్ద సవాలుగా మారింది. . జనసేన ప్రభావం తక్కువగా ఉండే రాయలసీమలో కూడా తెలుగుదేశం అధిపత్యం చలాయించడానికి ప్రధాన కారణం రెడ్లు. రెడ్లలో కసి తగ్గింది వైసీ?పీకి దూరమయ్యారని జగన్ కు ఇప్పుడు తెలిసి వచ్చింది. అయితే వారిని తిరిగి దరి చేర్చుకోవడం అంత సులువు కాదు. కాలమే దగ్గరకు చేరుస్తుందన్న నమ్మకంతో జగన్ ఉన్నట్లు కనపడుతుంది. ఎందుకంటే జగన్ పార్టీ ఆఫీసులను కూల్చి వేత పనులను ప్రారంభించడంతో పాటు జగన్ ను ఇబ్బంది పెడుతున్నారన్న సింపతీ మొదలయితే తప్ప తిరిగి వారు చేరరన్న అభిప్రాయంలో ఉన్నారు. ఈసారి అందరితోనూ కలిసేలా, తనకు, నేతలకు మధ్య గ్యాప్ ఉండకుండా ఉండేలా చూసుకునేందుకు జగన్ జాగ్రత్త పడుతున్నారని తెలిసింది. బెంగళూరులో ఉన్న జగన్ ముఖ్యమైన రెడ్డి సామాజికవర్గం నేతలను పిలిపించుకుని ఇదే అంశంపై చర్చించినట్లు తెలిసింది. తనకు సహకరించాలని వారిని కోరినట్లు చెబుతున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఆ సామాజికవర్గం మద్దతు లభించాలంటే ఎంతకాలం పడుతుందన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేని పరిస్థితి అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## తాగుబోతు భర్తను మట్టుపెట్టిన భార్య

పెడన,బంటుమిల్లి మండల పరిధిలోని చిన్న తుమ్మడి గ్రామంలో దారుణం జరిగింది. భర్త మెడపై భార్య స్క్రూ డ్రైవర్ తోపొడిచి హత్య చేసింది. తరచూ తాగి వచ్చి కొట్టడంతో హింస భరించలేక హత్య చేశానపి భార్యఅంటోంది. అప్పారావు (30), కీర్తన లకు

తోమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడు సంవత్సరాల బాబు వున్నాడు. మంగళవారం రాత్రి సుమారు 11 గంటలు గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వివాదం జరిగింది. ఆవేశంతో స్క్రూ డ్రైవర్ తో కీర్తన భర్త మెడపై పొడిచి చంపింది.

# విశాఖ స్థానిక ఎమ్మెల్సీ పోటీ...బరిలో ఎవరు

విశాఖపట్టణం, జూలై 3, ఎమ్మె?ల్యే వంశీ రాజీనామాతో ఖాళీ అయిన విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఇందుకోసం తెలుగుదేశం పార్టీలో పెద్ద ఎత్తున లాబింగ్ జరుగుతోంది. 164 స్థానాలతో అధికారంలో వచ్చింది టీడీపీ. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఓటర్ల మద్దతు పొందడం సులభం అన్నది టీడీపీ నేతల అభిప్రాయం. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే నేతల సంఖ్య పెరుగుతోంది. ఈ వరుసలో టీడీపీ నుంచి అవకాశం ఎవరికి వస్తుంది. కౌంటర్ గా వైఎస్ఆర్సీపీ నుంచి బరిలో ఎవరిని దింపే అవకాశం ఉందన్న చర్చ ప్రస్తుతం పెద్ద ఎత్తున సాగుతోంది. విశాఖ స్థానిక సంస్థల నుంచి 2021లో వైఎస్ఆర్సీపీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సిహెచ్ వంశీకృష్ణ యాదవ్ అనంతం మారిన పరిణామాల్లో పార్టీ వీడారు. 2023 డిసెంబర్‌లో అప్పటి అధికార పార్టీకి రాజీనామా చేయడంతో పాటు జనసేనలో చేరిపోయారు. అధికార పార్టీ అధినేత తోపాటు ఇతర నేతలను విమర్శించడంతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఆయనకు కౌన్సిల్ చైర్మన్ నోటీసులు ఇవ్వడం, అనర్హత ప్రకటించడమే కాకుండా విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాన్ని ఖాళీగా చూపించడం వరకు చకచకా జరిగిపోయాయి.ఇది జరిగి ఇప్పటికీ దాదాపు నాలుగు నెలలుగా వస్తుంది. ఆరు నెలలలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ త్వరలో వీటిపై ఒక నిర్ణయాన్ని వచ్చే అవకాశం ఉంది. అంటే వీలైనంత త్వరలో రెండు నెలల్లోనే ఎన్నిక పూర్తి చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ వీలైనంత తొందరలో ప్రారంభమయ్యేలా కనిపిస్తోంది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్నికలపై మరోసారి అందరి దృష్టి పడింది.2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో దాదాపు 90 శాతానికి పైగా స్థానిక సంస్థలని అప్పటి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. దీనిపై అప్పట్లోనే అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. స్థానిక సంస్థల్లో దాదాపు అన్ని స్థానాలను కైవసం చేసుకోవడంతో వాటి ఆధారంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులే విజయం సాధిస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే విశాఖ స్థానిక సంస్థల నుంచి టీడీపీ ఎవరిని పోటీ కూడా దింపలేకపోయింది. దాంతో వంశీ యాదవ్ ఎన్నిక అప్పట్లో 2021లో ఏకగ్రీవమైంది. మొదటి నుంచి ఎమ్మెల్యే కావాలన్న లక్ష్యంతో ఉన్న వంశీ అసంతృప్తి గానే ఎమ్మెల్సీ తీసుకున్నారు. తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెండేళ్ల ఎమ్మెల్సీ పదవి తర్వాత 2023 డిసెంబర్‌లో వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన మూడు రోజుల తర్వాత తొమ్మిది పేజీల ఘాటైన లేఖను వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు జగన్‌కు రాస్తూ, పార్టీ విధానాల్ని తీవ్రంగా దుయ్యపట్టారు. అయితే ఎమ్మెల్సీ పదవికి మాత్రం తాను రాజీనామా చేయబోనని, తాను పడ్డ కష్టానికి ఇచ్చిన గుర్తింపు తప్పా.. వైఎస్ఆర్సీపీ నాకేమీ గంపగుత్తగా, ఉచితంగా ఈ పదవి ఇవ్వలేదంటూ వంశీ అప్పట్లో పెద్ద రాద్ధాంతమే చేశారు. కానీ జనసేనలో చేరి పార్టీ అధిష్టానం మీద పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుండడంతో పార్టీ ఫిరాయింపుల కింద ఎమ్మెల్సీ పదవిని రద్దు చేస్తూ శాసనమండలి చైర్మన్ నిర్ణయం తీసుకున్నారు. 2024 ఫిబ్రవరిలో దానికి సంబంధించి ఆ స్థానాన్ని ఖాళీ చూపిస్తూ గెజిట్ కూడా విడుదల చేశారు. ప్రస్తుతం జూలై నెల ప్రారంభంతో దాదాపుగా నాలుగు నెలలు ముగిశాయి మరో రెండు నెలల్లో ఈ స్థానానికి ఎన్నిక జరపాల్సి ఉంది. అందుకోసం అధికార ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలని తిరిగి ప్రారంభించాయి.రాజకీయ పరిణామాలు నేపథ్యంలో టీడీపీ విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీని ఎలాగైనా దక్కించుకోవాలన్న లక్ష్యంతో ఉంది. వాస్తవానికి మొత్తం ఓటర్లు 725 మంది వరకు ఉన్నారు. అందులో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఓటర్లుగా ఉన్న స్థానిక సంస్థల్లో టీడీపీకి 180 ఓట్లు మాత్రమే ఉండగా, మిగతా 545 వైసీపీకి ఉన్నాయి. అయితే వైసీపీకి స్పష్టమైన ఆధిక్యత దక్కే అవకాశం ఉంది కానీ, రాష్ట్రంలో 164 స్థానాలు దక్కించుకున్న ఎన్డీయే కూటమి ఒక్క ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా ఇకపై వైఎస్ఆర్ సీపీకి దక్కకుండా చేసే ఆలోచనలో వ్యూహం పన్నుతోందట. ఇప్పటికే వైసీపీతో ఉన్న 545 మంది స్థానిక సంస్థల ఓటర్లలో పలువురు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నామన్న సంకేతాలు ఇవ్వగా, మరికొందరు పార్టీ మారకపోయినా అభ్యర్థిని బట్టి తెలుగుదేశంకి ఓటు వేసే అవకాశం కూడా ఉందన్న సంకేతాలు ఉన్నాయి. దీంతో సరైన అభ్యర్థి కోసం తెలుగుదేశం అన్వేషిస్తుంది. మొన్నటి ఎన్నికల్లో పొత్తుల లో భాగంగా తమ స్థానాలు కోల్పోయిన సమర్థులైన నేతలని ఎంపిక చేయాలని నిర్ణయించుకుంది. ఆ రకంగా పలువురు పేర్లు పరిశీలించినప్పటికీ, విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పార్టీ ఇంచార్జిగా ఉంటూ, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను ప్రతిపక్షంలో ఉంటూ పార్టీ అధినేత మన్ననలు పొందిన గండీ బాబ్జీపై టీడీపీ అధిష్టానం దృష్టి పడింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవిని వదిలేసి అదే దక్షిణ నియోజకవర్గం కు ఎమ్మెల్యేగా ఎన్నికైన వంశీకే గండి బాబ్జి ఆ స్థానాన్ని త్యాగం చేసి ఉండడంతో.. వంశీ రాజీనామా చేసిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి గండి బాబ్జినే సరైన అభ్యర్థి అని తెలుగుదేశం భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతానికి ఆయనకి విశాఖ అర్బన్ టీడీపీ అధ్యక్షుడిగా ఇచ్చినప్పటికీ, గతంలో పెందుర్తి ఎమ్మెల్యేగా, ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా గట్టి ఉన్న నాయకుడిగా గుర్తింపు ఉంది. గండి బాబ్జి అభ్యర్థిత్వానికి ఎక్కువ మంది మొగ్గు చూపే అవకాశం ఉండడంతో, ఆయననే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబెట్టాలని టీడీపీ భావిస్తున్నట్టు సమాచారం. దానికి తోడు అవసరమైతే ఆర్థిక వనరులను కూడా కూడగట్టుకుని, మెజార్టీ పొందేందుకు గండి బాబ్జి సమర్థుడు అన్న ఆలోచన కూడా తెలుగుదేశం పార్టీ చేస్తున్నట్టు సమాచారం. అధికారికంగా ప్రకటించక పోయినప్పటికీ గండి బాబ్జి నే సరైన అభ్యర్థి అన్న సంకేతాలను టీడీపీ ఇస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతం మెజారిటీ ఉన్నప్పటికీ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి. ఎందుకంటే 545 మంది ఓటర్లు ఉన్నప్పటికీ వారంతా ప్రస్తుతం వైఎస్ఆర్సీపీకి ఓటేసే అవకాశం లేదు. వాళ్ళలో ఎక్కువ మంది పార్టీ మారేందుకు ఆసక్తి చూపుతున్నారట. మిగతా వాళ్ళు తమకు ఎన్నికల్లో చాలా ఖర్చులయ్యాయని, ఆ రకంగా ఆర్థిక సహకారం అందించిన వాళ్లకే ఓటేస్తామని చెప్పే ఆలోచనలో స్థానిక సంస్థల ఓటర్లు ఉన్నట్టు సమాచారం. అలాంటి సంకేతాలు కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఆర్థికంగా కూడా కొంత భారాన్ని మోయాల్సి ఉంటుంది. అమర్ కి అవకాశం ఇస్తే కొంతమేర టీడీపీ వ్యూహాలను నిలువరించే అవకాశం ఉంటుందన్న ఆలోచనలో ప్రతిపక్ష పార్టీ ఉన్నట్టు సమాచారం.అమర్ ? గండి బాబ్జీ ల మధ్య పోటీ సాగితే, స్పష్టమైన ఆధిక్యం ఉన్న వైఎస్ఆర్సీపీ గెలుస్తుందా..? లేదంటే 164 స్థానాలను గెలుచుకుని శత్రుదుర్భేద్యంగా ఉన్న టీడీపీనే ఈ స్థానాన్ని కైవసం చేసుకుంటుందా? అదే సమయంలో ఎలాగైనా అసెంబ్లీకి వెళ్లాలన్న లక్ష్యంతో పనిచేసిన గండి బాబ్జి అసెంబ్లీకి వెళ్లలేకపోయినా చట్టసభల సభ్యుడిగా, కౌన్సిల్ కి వెళ్లే అవకాశం ఉందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది..!

## స్వరూపానందకు భీమిలిలో ఇచ్చిన 15 ఎకరాలు రద్దు చేయాలి

**శారదాపీఠం ఆస్తులపై సీబీఐ,ఈ డీ లతో విచారణ జరపాలి**

**నకిలీ శారదాపీఠాన్ని మూసేసి అటువంటివి రాకుండా చర్యలు తీసుకోవాలి**

**ఏపీ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద,జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్**

విశాఖపట్నం,శారదాపీఠం పేరిట నకిలీ పీఠం పెట్టి వేల కోట్లు దోపిడీ చేసి గత వైసీపీ ప్రభుత్వం ద్వారా భీమిలిలో స్వరూపానంద కేటాయింప జేసుకొన్న 15 ఎకరాల భూకేటాయింపులను రద్దు చేయాలని ఏపీ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద, జనసేన నేత మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు స్వాములతో కలసి వీరు భీమిలి మండలం కొత్త వలస గ్రామం సర్వే 102-2 , 103 లలో స్వరూపానందకు భీమునికొండపై కేటాయించిన భూములను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఈ భూకేటాయింపులు స్వరూపానంద వేద పాఠశాల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే చేయించుకొన్నారని ఆరోపించారు. అసలు పీఠానికే గుర్తింపు లేనప్పుడు, వేద విద్యార్థులే ఇక్కడ శిక్షణ పొందనప్పుడు జగన్ ప్రభుత్వం గుడ్డిగా 15 ఎకరాలు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని కేటాయింపు రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ భూములను వ్యాపార అవసరాలకు వాడతామని శారదాపీఠం ఉత్తరాధికారిగా చెప్పుకొనే సాత్మానంద మూడు నెలల క్రితం ప్రభుత్వానికి లేఖ రాసి తమ ఉద్దేశాలను బహిర్గతం చేశారని, ఈ లేఖ ఆధారంగా కేటాయింపులను నిముషంలోరద్దు చేయవచ్చని చెప్పారు.భీముడు కూర్చున్న స్థలం అదిస్వరూపానంద కు కేటాయించిన భూమి పాండవులలో ఒకరైన భీముడు కూర్చున్న స్థలం అని స్థానికులు నమ్మకమని, దానిని తవ్వకాలు, కట్టడాల పేరిట ధ్వంసం చేయడం తగదని అన్నారు. భీముని పట్నానికి పేరు కూడా భీముడి వల్లే వచ్చిందని గుర్తుచేశారు. స్వరూపానందకు కేటాయించిన స్థలంలో అత్యంత విలువైన ఔషదిమొక్కలు, చిన్న చిన్న అటవీ జంతువులు ఉన్నాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వున్నదని అన్నారు.రెండు కోట్లతో రోడ్డు వేసిన అధికారులపై చర్యలుస్వరూపానంద కోసం రెండు కోట్లతో ఆయనకు కేటాయించిన భూమికి ఫూట్ రోడ్ వేసిన వీఎంఆర్డీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇందుకు బాధ్యులను గుర్తించి ఈ రెండు కోట్ల రూపాయలను వారి నుంచి రికవరీ చేయాలని కోరారు. రహదారి కోసం తవ్విన గ్రావెల్ ను కోట్ల రూపాయలకు అమ్ముకొన్నట్లు ఆరోపణలు వున్నందున దానినీ రికవరీ చేయాల్సిన అవసరం వుందని శ్రీనివాసానంద, మూర్తి యావద్ లు అన్నారు. ఇప్పటికే కొండ ను చాలా వరకూ ధ్వంసం చేశారని ఇకపై జరగకుండాచూడాలని కోరారు.శారదాపీఠాన్ని రద్దు చేయాలిస్వరూపనంద చరిత్ర, వారసత్వం, ధర్మాధికారి వంటివి ఏమీ లేకుండా కేవలం ఆధ్మాత్మికత ముసుగులో సందపాన కోసం ఏర్పాటు చేసి పెందుర్తి శారదాపీఠాన్ని రద్దు చేయాలని వారు డిమాండు చేశారు. శారదాపీఠం ముసుగులో పెద్ద ఎత్తున అక్రమాలు, మోసాలు జరుగుతున్నాయని వాటిన్నింటిపై విచారణ జరపాలని కోరారు. చినముషిడివాడలో గెడ్డను కబ్జా చేసి నిర్మించిన శారదాపీఠం స్వాముల ఆస్తులు ఇప్పుడు వేల కోట్లకు చేరాయని వీటిపై సీబీఐ, ఈ డీ విచారణ జరపాలని డిమాండు చేశారు. ఫిక్స్ డ్ డిపాజిట్ లు వంద కోట్లకు చేరినా ప్రభుత్వానికి సోర్స్, లెక్క చెప్పడం లేదని అన్నారు. హిందూ ధార్మిక సంస్థ నిర్వాహకుడు తురగా శ్రీరామ్, పలువురు స్వాములు, మాతాజీలు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి ఏసీఏకు విముక్తి

విశాఖపట్టణం, జూలై 3,పూర్తిగా వైసీపీ నేతలతో, విజయసాయి రెడ్డి అల్లుళ్ళు, అనుచరులతో నిండిపోయిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) వారి కంబంధ హస్తాల్లో నుంచి బయటపడనుంది. వైసీపీ ఉత్తరాంధ్రా ఇన్చార్జి హోదాలో విజయసాయి రెడ్డి వందల కోట్ల ఆస్తులు, డిపాజిట్లు ఉన్న ఏసీఏపై కన్ను వేసి అక్రమ మార్గాల్లో చేతుల్లోకి తీసుకొని పాత కార్యవర్గాన్ని బలవంతంగా పంపించేసి తన మనుషులతో నింపేశారు. ఢిల్లీ మద్యం కేసులో తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలోనే తన పెద్ద అల్లుడు పి.శరత్‌చంద్రారెడ్డితో నామినేషన్ వేయించి అధ్యక్షుడిని చేశారు. ఆ నామినేషన్ పత్రాలను పట్టుకువచ్చి ఆయన తమ్ముడు, విజయసాయి సొంత అల్లుడు పి.రోహిత్ రెడ్డి ఆయనకు కూడా తెలియకుండానే అప్పటికప్పుడు నామినేషన్ వేసి ఉపాధ్యక్షుడు అయిపోయారు. ఇక విశాఖలో విజయసాయి బినామీగా పేరుపడ్డ ఎస్ఆర్ గోపీనాధ్ రెడ్డి కార్యదర్శిగా ఎన్నికయ్యారు.ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి రావడంతో కోట్లలో అక్రమాలకు పాల్పడ్డ ఈ కార్యవర్గానికి భయం పట్టుకొంది. ఇప్పటికే తీవ్ర ఆరోపణలు రావడం, ఫిర్యాదులు వెళ్లడంతో భవిష్యత్‌లో కేసులు, అరెస్టులు లేకుండా స్వచ్ఛందంగా తప్పుకొనేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నట్లు తెలిసింది. ఈ కార్యవర్గం కడప స్టేడియం, పులివెందుల గ్రౌండ్ పేరిట కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేసింది. 'ఆడుదాం ఆంధ్రా'లో కూడా ఏసీఏ దూరి అక్రమాలకు పాల్పడింది. చివరకు విశాఖలో ఉన్న స్టేడియంను మూసేసి దానిని తమ గుప్పెట్లో పెట్టుకొని భోగాపురం వద్ద కొత్త స్టేడియం కట్టాలనే ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చింది.విశాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అన్యాయాలపై ఇప్పటికే దృష్టి సారించిన మంత్రి లోకేశ్ ఏసీఏని చక్కదిద్దే పనులను ప్రారంభించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాధ్ (చిన్ని)కి ఏసీఏ వ్యవహారాలను చక్కదిద్ది కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యవర్గం అక్రమాలపై పూర్తి ఆధారాలు లోకేశ్ వద్ద వుండడంతో ఆయన ఈ కార్యవర్గాన్ని తప్పించే పనికి శ్రీకారం చుట్టారని తెలిసింది. వారంతట వారు వెళ్లిపోతారా? లేక అరెస్టులు, కేసులకు సిద్ధమౌతారో కనుక్కోమని చెప్పడంతో వారంతా రాజీనామాలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని సున్నితంగా అమలు చేసే బాధ్యతను కేశినేని చిన్ని స్వీకరించారు. అందులో భాగంగానే ఆదివారం విశాఖ స్టేడియంలో జరిగిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మూడవ సీజన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిన్నితో పాటు క్రీడల శాఖామంత్రి రాంప్రసాదరెడ్డి హాజరయ్యారు.విశాఖ క్రికెట్ స్టేడియం హక్కుదారైన విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రూ.24 కోట్ల బకాయి పడింది. ఈ రెండు సంఘాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణ వల్ల వచ్చే ఆదాయంలో 40 శాతం వీడీసీఏకి ఏసీఏ చెల్లించాలి. ఒప్పందం కుదిరిన తరువాత రెండు పర్యాయాలు మాత్రమే చెల్లించిన ఏసీఏ గత పది సంవత్సరాలుగా వాటా ఇవ్వడం మానేసింది. విజయసాయి కార్యవర్గం కూడా హామీ ఇచ్చి మాట తప్పడంతో ఇప్పుడు రాబోయే కొత్త కార్యవర్గం బకాయి తీరుస్తుందని వీడీసీఏ కార్యవర్గం ఎదురుచూస్తోంది.

## ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి

**ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి యుటిఎఫ్ వినతి**

బద్వేలు,ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తగు సహకారం అందించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది.ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డిని కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యా రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, వైసిపి ప్రభుత్వం విద్యారంగం పట్ల అవలంభించిన విధానాల వల్ల ప్రభుత్వ విద్యా రంగంలో సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఆనాలోచిత చర్యలు, అసంబద్ధ విధానాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని తిరోగమనం వైపు నడిపించాయని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతామని, ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117 ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకారం అందించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, పట్టభద్రుల ప్రతినిధిగా విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్సీకి వారు విజ్ఞప్తి చేశారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో ప్రాథమిక విద్యను నీర్వీర్యం చేసిన జీవో నెం.117 ను తక్షణం రద్దు చేయాలని, 1-5 తరగతులను ప్రాథమిక విద్య పరిధిలో, 6-10 తరగతులను మరియు 6-12 తరగతులను సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, విద్యార్థి, తల్లిదండ్రుల అభీష్టం మేరకు మాధ్యమాన్ని ఎంపిక చేసుకొని చదువుకునే అవకాశాన్ని కల్పించాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేసే చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు కార్యక్రమం బాధ్యతల నుండి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను తప్పించాలని, నూతన మెగా డీఎస్సీ ని నిర్వహించి, నియామకాలు చేపట్టే లోపే ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టి, బదిలీలు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని. సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సీని అమలు చేయాలని, పిఆర్సీ అమలు అయ్యేవరకు మధ్యంతర భృతిని చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రత్యేకించి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడుతుందని పేర్కొన్నారు. యుటిఎఫ్ ప్రస్తావించిన సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవి కుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, చెరుకూరి శ్రీనివాసులు, ఎస్.ఏజాస్ అహమ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరి, నాయకులు ఎస్.అనిల్ కుమార్,ఎం.లక్ష్మీ దేవమ్మ, ఎస్.ఎం. భాష తదితరులు పాల్గొన్నారు.

## పొట్లదుర్తిలో భారీగా ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

కడప,ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ సమీపంలో 158 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి వేళ మినీ లారీలో పొరకల చాటున ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. . దాదాపు నాలుగు వేల కిలోల బరువు గల 158 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ తో పాటు,మరో కొంత మంది పరారైనట్లు సమాచారం.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏపీలో పవర్ స్టార్ బ్రాండ్....

నెల్లూరు, జూలై 3, ఏపీలో మద్యం బ్రాండ్లపై రగడ మొదలైంది. కూటమి ప్రభుత్వం కొత్తగా పవర్ స్టార్ విస్కీ బ్రాండ్ తెచ్చిందని ఓ పోస్టు పెట్టింది. దీనిపై టీడీపీ, జనసేన పార్టీలు గట్టి కౌంటర్ ఇచ్చాయి. అది 2022 లో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన బ్రాండ్ అని టీడీపీ, జనసేన వీడియోలు పోస్టు చేశాయి.పవర్ స్టార్ విస్కీ.. కూటమి ప్రభుత్వంలో కొత్త బ్రాండ్ అంటూ వైసీపీ విమర్శించారు. నాణ్యమైన మద్యం అంటూ జనసైనికుల్ని మెప్పించేలా పవర్ స్టార్ పేరుతో విస్కీని చంద్రబాబు సర్కార్ తెరపైకి తెచ్చిందని వైసీపీ ఎక్స్ లో పోస్టు పెట్టింది. ఏపీలో మాత్రమే ఈ బ్రాండ్ అందుబాటులోకి ఉంటుందని, నాణ్యమైన మద్యం అంటే ఇదేనా బాబూ అంటూ సెటైర్లు వేసింది.వైసీపీ ట్వీట్ కు అధికార టీడీపీ గట్టి కౌంటర్ ఇచ్చింది. జగన్ పాపాలు చేయడంలో శిశుపాలుడికి గాడ్ ఫాదర్ అంటూ ట్వీట్ చేసింది. తానే విషపు మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ అయి ఉండి ఇతరులపై విష ప్రచారం చేస్తున్నారని టీడీపీ విమర్శించింది. ఐదేళ్లలో ప్రమాదకర మద్యంతో లక్షలాది జనం ప్రాణాలు తీశారని ఆరోపించింది. ప్రపంచంలో ఎక్కడా దొరకని డేంజరస్ లిక్కర్ త్రీ క్యాపిటల్స్, ప్రెసిడెంట్ మెడల్, ఆంధ్రా గోల్డ్, బూమ్ బూమ్, 99 పవర్ స్టార్ ఇవన్నీ జగన్ దోపిడీ కోసం తెచ్చిన బ్రాండ్లు అని కౌంటర్ ఇచ్చిందివైసీపీ ట్వీట్ పై జనసేన ఘాటుగా స్పందించింది. ఆ పార్టీ అధినేత ఎన్నికల ప్రచారంలో తన పేరిట మద్యం బ్రాండ్ తెచ్చారని మాట్లాడిన వీడియో పోస్టు చేసింది. వైసీపీకి అల్జీమర్స్ వ్యాధి సోకితే అది మా తప్పా? ఆ బ్రాండ్ తెచ్చింది మీరే అని మర్చిపోయారా? అంటూ జనసేన ట్వీట్ చేసింది."పవర్ స్టార్ బ్రాండ్! నిజమే, ఆయన ఒక బ్రాండ్. మీరు తెచ్చిన కల్తీ మద్యానికి కాదు, మానవత్వానికి. మీరు చేసిన అవినీతికి కాదు, అభివృద్ధికి!మీరు తెచ్చిన సంక్షోభానికి కాదు, సంక్షేమానికి! బాధ పడకండి, మీరు తెచ్చిన కల్తీ మద్యం నుంచి, మీరు సృష్టించిన సంక్షోభం నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు త్వరలోనే సంపూర్ణ విముక్తి పొందుతారు. ఇక మీరు శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని హాయిగా బెంగుళూరు ప్యాలస్ లో విశ్రాంతి తీసుకోవచ్చు" అని ట్వీట్ చేసింది.జనసేన శతఘ్ని టీమ్ సైతం వైసీపీ ట్వీట్ పై స్పందించింది. మద్యం అనే పదార్థాన్ని వైసీపీ రాజకీయ అస్త్రంగా వాడుకోవాలి అనే ఉద్దేశం ఉంటే మానుకోవాలని హితవుపలికింది. పవర్ స్టార్ బ్రాండ్ వైసీపీ తెచ్చిందేనని పేర్కొంది. మద్యంలో ఎంత అవినీతి చెయ్యొచ్చో అంతా చేశారని విమర్శించింది. మద్యపాన నిషేధం అన్న వైసీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు మద్యం దుకాణాలని నడిపిందని విమర్శించారు. భవిష్యత్తులో మద్యం తాగేవారి తలపై కూడా చెయ్యి పెట్టి అప్పులు తెచ్చిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదని సెటైర్లు వేశారు.

## ఎవరీ భోలే బాబా.?

లక్నో, జూలై 3,ఎవరీ భోలే బాబా..? లక్షల మంది భక్తులు వెళ్లేంతగా.. ఆ సత్సంగ్‌లో ఏముంది..?యూపీలోని ఎటా జిల్లాలోని పాటియాలీ తహసీల్ ప్రాంతానికి చెందిన భోలే బాబా అసలు పేరు.. సూరజ్‌పాల్. కాన్షీరామ్‌నగర్‌కు చెందిన ఇతడు.. తనను తాను దేవుడికి ప్రతిరూపంగా చెప్పుకుంటాడు. ఉత్తరప్రదేశ్ పోలీస్ విభాగంలో పనిచేసిన సూరజ్‌పాల్.. 2006లో వీఆర్ఎస్ తీసుకుని భోలే బాబాగా అవతారం ఎత్తాడు. తనకు ఎవరూ గురువులు లేరని, భగవంతుడే తనకు జ్ఞానాన్ని అనుగ్రహించాడని చెప్పుకుంటాడు భోలే బాబా. మొదట్లో తన సొంత గ్రామంలోనే ఒక గుడిసెలో ఉంటూ ఆధ్యాత్మిక ఉపదేశాలు చేసిన భోలేబాబా.. ఇతర ప్రాంతాల్లో కూడా తన ఆశ్రమాలను ఏర్పాటు చేశాడు. ఇతడికి ఉత్తరప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా లక్షల సంఖ్యలో భక్తులు ఉన్నారు.తన భక్తులకు బోధనలు ఇచ్చేందుకు ప్రతి ఏటా సత్సంగ్ పేరుతో భారీ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తాడు భోలే బాబా. ఈ సత్సంగ్‌లో తన భార్యతో పాటు ఆసనంలో కూర్చుని బోధనలు అందిస్తాడు భోలే బాబా. కార్యక్రమం చివర్లో బాబా అనుచరులు భక్తులకు జలాన్ని పంపిణీ చేస్తారు. ఈ పవిత్ర జలం తీసుకుంటే రోగాలు దూరమవుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఈ సంత్సంగ్‌కు లక్షల సంఖ్యలో జనం తరలి వస్తుంటారు. కరోనా సమయంలో కూడా నిబంధనలు పాటించకుండా.. 50వేల మందితో ఈ కార్యక్రమం నిర్వహించాడు భోలే బాబా.ప్రస్తుతం ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో గత రెండేళ్లుగా భారీగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు..బాబా అనుచరులు. ఈ ఏడాది రతిభాన్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రచారం కూడా నిర్వహించారు. ఊరూరా పోస్టర్లు అంటించారు. అయితే ఇంతపెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నా కూడా.. పోలీసుల నుండి గానీ, అధికార యంత్రాంగం నుండి గానీ ఎలాంటి అనుమతులు తీసుకోలేదు నిర్వాహకులు. అటు అధికారం యంత్రాంగం కూడా ఈ బాబా వ్యవహారంలో చూసి చూడనట్టు వ్యవహరించింది. స్థానిక ఆధ్యాత్మిక గురువు సంస్మరణార్థం ఏడాదికి ఒకసారి మాత్రమే జరిగే ఈ కార్యక్రమానికి.. నిర్వాహకులు భోలే బాబా సత్సంగ్ పేరుతో భారీగా ప్రచారం నిర్వహించారు. దీంతో ఉత్తరప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 50 వేలమందికి పైగా వచ్చిన భక్తులను.. రాత్రి 11 గంటల నుంచి బారికేడ్లు అడ్డుపెట్టి..రోడ్లపై నిర్బంధించారు. ఉదయం ఒక్కసారిగా వాటిని తొలగించడంతో భక్తులు దూసుకువచ్చారు. దీంతో భారీ తొక్కిసలాట జరిగింది.ఈ తొక్కిసలాటలో పదుల సంఖ్యలో మహిళలు, చిన్నారులు బలైపోయారు. గాయపడ్డవారిని ఎటా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మృతదేహలను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే మృతదేహాలను ఉంచేందుకు అక్కడ సరిపడ స్థలం లేకపోవడంతో కమ్యూనిటీ హాల్ నేలపైన, ఆవరణలో లైన్‌గా పరిచారు అధికారులు.. కమ్యూనిటీ హాల్‌లో తమవారి మృతదేహాలను చూసి బంధువులు, కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. వారి ఆర్తనాదాలతో ఈ ప్రాంతమంతా విషాదం అలముకుంది.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. భక్తులు ఒక్కసారిగా పరుగులు తీయడం వల్లే తొక్కిసలాట జరిగిందని పోలీసులు చెబుతున్నారు. అయితే వారు ఎందుకు పరుగులు తీశారన్నదానిపై దర్యాప్తు కొనసాగుతోంది.హత్రాస్ ఘటనపై లోక్‌సభలో ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.భక్తుల తాకిడితో స్థానికంగా ఉన్న ట్రాఫిక్ వ్యవస్థ కుప్పకూలింది. అటు నిర్వాహకులు కూడా లక్షల సంఖ్యలో వచ్చిన భక్తులను కంట్రోల్ చేయలేక చేతులెత్తేశారు. దీంతో పెనువిషాదం చోటుచేసుకుంది.

# క్యాస్ట్ వెరిఫికేషన్ 15 రోజులలో పూర్తి చేయాలి...




కర్నూలు ,జూలై 3 :-వీఆర్వోలు క్యాస్ట్ వెరిఫికేషన్ చేసిన వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి. తహశీల్దార్లు పరిశీలించి ఆమోదించాలని , అలాగే రెవెన్యూ సర్వీసెస్ సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో సమీక్షించి ఆదేశించారు.బుధవారం ఉదయం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య అన్ని మండల తహశీల్దార్లు మరియు వీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ

## మీసేవ రెవెన్యూ సర్వీసెస్ సమస్యలు గడువులోగా పరిష్కరించండి...
## తహశీల్దార్లు మరియు వి ఆర్ ఓ ల వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య...

సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ విఆర్ఓ లు ఏ విధంగా క్యాస్ట్ వెరిఫికేషన్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు . వీరు చేస్తున్న వెరిఫికేషన్ ను ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారని తహశీల్దార్ల ను ప్రశ్నించి తెలుసుకున్నారు.జాయింట్ కలెక్టర్ క్యాస్ట్ వెరిఫికేషన్ కు సంబందించి సూచనలు ఇస్తూ... మొదటగా మీ గ్రామ పరిధిలో కుల ధ్రువీకరణ పత్రాల కొరకు వచ్చిన అప్లికేషన్ లిస్టును తీసుకొని వారి అడ్రస్ ప్రకారము వారి ఇంటికి వెళ్లి వారి ఇంటిలో ఇంతకు మునుపు ఎవరైనా కుల ధ్రువీకరణ పత్రము పొంది ఉంటే దానిని సరిచూసుకొని , వారి అడ్రస్ ఆధార్ కార్డు ద్వారా ధ్రువీకరించుకొని , చుట్టుప్రక్కల నివాసముంటున్న వారిని విచారించి , గ్రామ తలారి నీ విచారించి , వారికి సంబందించిన ట్రాన్సుర్ సర్టిఫికెట్ లను పరిశీలించి మరియు నవశకం ఆప్ లో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించుకొవాలని , ఆ విధంగా అన్ని పరిశీలనలు చేసి ఆన్ లైన్ లో పొందు పరచాలని ఆదేశించినారు. ప్రతిరోజు ఒక విఆర్ఓ దాదాపు 40 కాస్ట్ వెరిఫికేషన్లు చేయాలని ఆ విధంగా చేసి 15 రోజుల లోపల అన్ని వెరిఫికేషన్ లు పూర్తి చేయాలని , ఈ కార్యక్రమాన్ని నిశితంగా తహశీల్దార్లు పర్యవేక్షించాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు అలసత్వం చేసిన యెడల కఠినంగా శిక్షించబడతారని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 229685 క్యాస్ట్ వెరిఫికేషన్ కొరకు అప్లికేషన్లు రాగా 70604 పూర్తి అయినవని ఇంకా 159081 వెరిఫికేషన్లు జరగవలసి ఉన్నదని కావున ఏ విధంగా ఆలస్యం జరగకుండా వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించినారు.మీసేవ రెవెన్యూ సర్వీసులో భాగంగా ఫ్యామిలీ సర్టిఫికెట్లు , జనన , మరణ ధ్రువీకరణ పత్రాలు , మ్యూటేషన్ లు మొదలగునవి నిర్దేశిత గడువులోగా ప్రజలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు.మొబైల్ డిస్ట్రిబ్యూటింగ్ యూనిట్ వాహనాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీలో ఎటువంటి ఆలస్యము జరుగ రాదని , ఒకవేళ ఏదైనా కారణం చేత ఎండియు వాహనదారుడు రాకపోతే ఇతర వాహనదారులకు ఆ బాధ్యతలు వెంటనే అప్పజెప్పి నిత్యావసర సరుకు వితరణ వెంటనే జరిగే లాగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లు ను ఆదేశించారు.ఈ వీడియో సమీక్ష సమావేశం లో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ తేజ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి , పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి , డిస్టిక్ సప్లై ఆఫీసర్ కే. వి ఎస్. ఎం. ప్రసాద్, ఎడి సర్వే , తహశీల్దార్లు పాల్గొన్నారు.



జూలై మూడవ తేదీన ఉదయం పదకొండు గంటలకు కర్నూలు నగరంలోని కుమ్మరి గేరి అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్రీయ బాల స్వాస్య కార్యక్రమ సమన్వయకర్త హేమలత గారు సందర్శించినారు. అనంతరం తల్లులకు అతిసార నివారణ పై అవగాహన కల్పించినారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని. సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని భోజనానికి ముందు. మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుకోవాలని. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే త్రాగించాలని తెలిపారు. పిల్లలకు తాజా వేడి ఆహారమే తినిపించాలని కోరారు. ఎక్కడైనా డయేరియా కేసులు నమోదు అయితే వెంటనే ఆరోగ్య కార్యకర్తలకు విషయం తెలియజేయాలని అంగన్వాడీ టీచర్లకు ఆదేశించినారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారుచేయు విధానం. చేతి శుభ్రత గురించి అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించినారు. ఈ సందర్భంగా అతిసార నివారణకు సంబంధించిన గోడపత్రాలు అంగన్వాడీ టీచర్లు మరియు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి. సుజాత. అంగన్వాడీ టీచర్లు సావిత్రి.బాలదుర్గమ్మ. సుబ్బలక్ష్మి.. ఆశా కార్యకర్తలు కవిత మద్దమ్మ. మరియు ఖలీల్ పాల్గొన్నారు.

# యావత్ హిందూ సమాజానికిరాహుల్ క్షమాపణ చెప్పాలి




బాధ్యత మరచిన విపక్షనేత' బీజేపీ, మోదీ మీద ద్వేషం దేశంపై చూపిస్తున్నాడుగ విద్వేషం కక్కడానికి పార్లమెంటు వేదికా..?లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రవర్తన యావత్ భారతదేశం తలదించుకునేలా ఉందని సాయి ప్రదీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మీద, ప్రధాని మోదీ మీద అక్కసు వెళ్లగక్కడం మినహా ప్రజాసమస్యలపై ఏ మాత్రం శ్రద్ధలేనట్టు కనిపిస్తున్నదని చెప్పారు. "లోక్సభలో విపక్ష నేత హోదా చాలా బాధ్యతాయుత మైనది. కీలకమైనది. పేదలు, వెనుకబడిన వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి పనిచేయాల్సిన గురుతరమైన బాధ్యత అది. గతంలో అటల్ బిహారీ వాజ్పేయి. ఎల్.కే. అద్వానీ, సుష్మా

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పిటి సాయి ప్రదీప్

స్వరాజ్ వంటి దిగ్గజ నాయకులు ఎంతో బాధ్యతాయుతంగా ఈ హోదాను నిర్వర్తించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిపక్ష నేత పాత్రకు వారు వన్నెతెచ్చారు. 18వ సార్ల మెంటు ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలపడానికి ఉద్దేశించిన సమయంలో లోక్సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ, పార్లమెంటు వేదికను.. తన విద్వేషపూరిత ప్రసంగాలకు వేదికగా మలచుకోవ డం దురదృష్టకరం. యావత్ హిందూ సమాజానికి హింసను, విద్వే షాన్ని ఆపాదిస్తూ ఆయన మాట్లాడిన మాటలకు యావద్భారతం సాక్షీభూతంగా నిలిచింది. ఇది రాహుల్ గాంధీ అసలురంగులనుమరోసారి ప్రపంచానికి బట్టబయలు చేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ మీద రాహుల్ గాంధీ నానాటికీ పెంచుకున్న ద్వేషం నేడు మొత్తం హిందూ సమాజం మీద. దేశం మీద విద్వేషంగా మారిందని 'బీజేపీ పట్ల, మోదీ పట్ల పట్ల వారికున్న అక్కసును, ఎన్నికల్లో వరుసగా మూడోసారి ఓడిపోయిన ఉక్రోషం.. రాహుల్ గాంధీ ప్రసంగంలో స్పష్టంగా కని పించింది. కాంగ్రెస్ పార్టీ, వారి మిత్రపక్షాలు హిందుత్వాన్ని అవమానిస్తూ మాట్లాడటం ఇది మొదటిసారేమీ కాదు. సనాతన ధర్మాన్ని వారి మిత్ర పక్షాలు తీవ్రమైన పదజాలంతో విమర్శిం చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. మరోసారి ప్రజాస్వామ్య దేవాలయ మైన పార్లమెంటు వేదికగా రాహుల్ గాంధీ చేసిన విద్వేషపూరిత ప్రసంగం వారి వ్యూహాత్మక విష ప్రచారానికి తాజా ఉదాహరణ. 2014కు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హిం దువులను మాత్రమే శిక్షించే ఒక మత హింస బిల్లును రూపొం దించడానికి కూడా ప్రయత్నించారు. ఈ విద్వేషపూరిత చర్యకు కొనసాగింపే రాహుల్ గాంధీ ప్రస్తుతం చేసిన ప్రసంగమని ఎప్పటిలాగే రాహుల్ గాంధీ తన ప్రసంగంలో భాగంగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. నిజమైన సమస్యల మీద చర్చించవలసిన లోక్ సభను బహుశా ఎన్నికల ప్రచారమని భావించి ఇంకా తప్పుడు సమాచారంతో, తప్పుడు వీడియోలతో దుష్ప్రచారం చేసి లబ్ది పొందాలని రాహుల్ గాంధీ ప్రయత్నం చేస్తున్నట్లున్నారని దుయ్యబట్టారు. లోక్ సభలో విద్వేషపూరిత ప్రసంగం చేసినందుకు యావత్ హిందూ సమా జానికి రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని సాయి ప్రదీప్ డిమాండ్ చేశారు.

# ఊరూరా మీసేవ....!

## మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరు ఆపరేటర్లుగా ఇంటర్ చదివిన సభ్యురాళ్ల ఎంపికఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల రుణం

అమరావతీ :ఆన్లైన్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన వందలాదిసేవలందిస్తున్న మీ సేవ కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మహిళాశక్తి పథకం కింద రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వీటినిమంజూరు చేయనుంది. కేంద్రాలు ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను తాజాగా ఆదేశించింది. ఆగస్ట్ 15 నాటికి వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4,525 మీ సేవకేంద్రాలున్నాయి. వీటిలో మూడు వేల వరకు నగర, పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 12,769గ్రామ పంచాయతీలుండగ వేయిన్నర వరకే గ్రామాల్లో ఉన్నాయి.ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150కి పైగా ప్రభుత్వ, 600కు పైగా ప్రైవేటు కార్యకలాపాలకోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలు, నగరాల్లోని కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళాశక్తి పథకం కింద మీసేవ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.గ్రామైక్య సంఘాల పేరిట..గ్రామైక్య సంఘాల(విలేజ్ ఆర్గనైజేషన్) పేరిట మహిళా శక్తి మీసేవ కేంద్రాలను (ఎమ్మెస్ ఎమ్మెస్సీ) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కేంద్రం ఏర్పాటుకు రూ.2.50 లక్షల రుణాన్ని స్త్రీనిధి ద్వారాపంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. వీటితో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పేరొందిన కంపెనీల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్కనెక్షన్ కొనుగోలు చేయాలి. కేంద్రాలు ప్రారంభమైన తర్వాత ఆయా సంఘాలు రుణాన్ని నెలనెలా తిరిగి చెల్లించాలి. స్త్రీనిధి, స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, అంగన్వాడీ కేంద్ర భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాలు, వాటి ప్రాంగణాల్లో మీసేవ కేంద్రానికి 10 అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పుతో వసతి కల్పిస్తారు. ఆయా సంఘాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన సభ్యురాళ్లను మీ సేవ ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై మీ సేవ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా మహిళా సంఘాలతో మీసేవ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంటుంది.

# బాబాలకు పాలకులు సాగిలపడుతుంటే ఇలాంటి ఘటనలు తప్పవు :
## ఆప్ నేత సంజయ్ సింగ్

యూపీలోని హాథ్రాస్లో జరిగిన భోలే బాబా( సత్సంగ్లో విషాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొక్కిసలాటలో దాదాపు 121 మంది మరణించారు. ఈ ఘటనకు బాధ్యులైన బాబా ఆచూకీ అంతుబట్టడం లేదు. ఇక మంగళవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు .. సత్సంగ్ ప్రాంగణం వద్ద తొక్కిసలాట జరిగింది.కానీ ఆ ఘటన తర్వాత భోలే బాబా ఆనవాళ్లు దొరకడం లేదు. ఆయన పరారీలో ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆ బాబా కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ ఘటనపై దేశవ్యాప్తంగా కలకలం రేగింది. ఇక హత్రాస్ తొక్కిసలాట ఘటనపై ఆప్ నేత సంజయ్ సింగ్ స్పందిస్తూ దేశంలో ప్రజల ప్రాణాలకు విలువలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఓ వ్యక్తి ఏకంగా తన పేరిట బాబా బజార్ను నిర్మిస్తున్నా ఆయనపై ఎలాంటి నియంత్రణ లేదని అన్నారు. ఇది కేవలం హత్రాస్లోనే కాదని, దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణలో ఏం జరిగిందో మనమంతా చూశామని, హత్యాచార ఘటనలో దోషిగా తేలిన ఓ బాబా తాను కోరుకున్నప్పుడు బయటకు వస్తారని, ప్రభుత్వ యంత్రాంగం ఆయనకు సాగిలపడుతుందని అన్నారు. ఇలాంటి బాబాల మార్కెట్ దేశంలో ఓ వెలుగు వెలుగుతుంటే ఇలాంటి ఘటనలను ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు.

# సీబీఐ, ఈడీ బాబును ఎందుకు అరెస్టు చేయలేదు?

బీజేపీ పంచన చేరగానే వాషింగ్ మెషీన్లో వేసిన మాదిరి సుద్ధపురుషులు అయ్యారా ?ఎన్నికల ఫలితాల రోజున ఒకపైపు స్టాక్మార్కెట్ పడిపోయి రూ. 31 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరైపోతే, టీడీపీ అగ్రనేత భార్యకు (భువనేశ్వరి హెరిటేజ్ ) చెందిన కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు ఆ ఒక్క రోజు లోనే ఆర్జించింది ఇదెలా సాధ్యం ?దీనిపై విచారణ జరిపే దమ్ము ప్రభుత్వానికి ఉందా? ప్రధాని మోదీ ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్కుమార్ అనే ఊతకర్రల సాయంతో సభలోకి వస్తున్నారు అవినీతిపరులంతా కూటమి కట్టారని ఇండియా కూటమిపై గతంలో మోదీ పదేపదే ఆరోపణలు చేశారని, మరి చంద్రబాబు, అజిత్ పవార్, ప్రఫుల్లపటేల్ల విషయంలో జరిగిందేమిటీ-లోక్సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

# వాలంటీర్లకు తీపి కబురు?

వాలంటీర్ల వ్యవస్థ పై కసరత్తుచేస్తున్న ప్రభుత్వం!వాలంటీర్ల వ్యవస్థలో మార్పులు చేర్పులుచేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తుంది. వ్యవస్థ పేరును మార్చే యోచనలో ప్రభుత్వం ఉంది...సచివాలయం పరిధి నుంచి గ్రామ పంచాయితీలో పరిధిలోకి మార్పు చేసి ఒక్కో వాలంటీర్ కు 50నుంచి100ఇళ్లు పెంపు,,, వాలంటీర్ పేరునుగ్రామ సేవక్, వార్డు వాలంటీర్ ను వార్డ్ సేవక్ గా పేరు మార్చాలని ప్రభుత్వం అనుకుంటుంది....

## ప్రతి ఒక్కరూ కూడా దైవభక్తి కల్గి ఉండాలి..

దొర్నిపాడు,జులై:03, శ్రీ ప్రస్థానం న్యూస్:- సృష్టిలో పుట్టిన ప్రతీ ఒక్కరు కూడా దైవ భక్తి కల్గి ఉండాలని సామజిక వేత్త మర్రి పల్లె గ్రామానికీ చెందిన అబ్దుల్ గఫార్ అన్నారు.. బుదవారం దొర్ని పాడు మండల కేంద్రము లో ఆటో యాత్ర ద్వారా దైవ మార్గాన్ని మించింది మరొకటి లేదని.. పురవీధుల్లో ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్య పరిచారు..అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కూడా శాంతి యుతంగా జీవించి సన్మార్గాన్ని ఎంచు కోవడం ఉత్తమమైన మార్గం మరొకటి లేదని.. దైవ మార్గం ద్వారా అన్నీ జయించ వచ్చునన్నారు.. ఎంతటి వారైనా సరే భగవంతుని సేవచేయాల్సిందేనని ఆయన అన్నారు...





కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జలవనరులు, ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

# మూడు దశాబ్దాల వడ్డెర సంఘాల పోరాటాలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడు 1994వ సంవత్సరం మార్చి 14వ తేదీన హైదరాబాద్ లలిత కళ తోరణం లో వడ్డెర్ల రాష్ట్ర మహాసభ ఏర్పాటు చేయడం జరిగింది . మన కుల పెద్ద ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి శ్రీ జీ .వై. కృష్ణ, ఖమ్మం జిల్లా మధిర మాజీ శాసనసభ్యులు బండారు ప్రసాదరావు, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు జెరిపిటి రాములు, రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు బండారు శరభందిరాజు, కడప జిల్లా అధ్యక్షులు వడ్డే వెంకటాద్రి , అనంతపురం జిల్లా అధ్యక్షులు వడ్డే మహేష్ , వరంగల్ జిల్లా అధ్యక్షులు వడ్డే నెల్లూరుట్ల స్వామి, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు బత్తుల సంజీవరాయుడు మరియు అన్ని జిల్లాల నుండి దాదాపు పదివేల మంది వడ్డెర్లు మహాసభలోపాల్గొన్నారు. ఈ వడ్డెరల మహాసభకు అప్పటి ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు , కానీ హాజరు కాలేదు , ఈ మహాసభ ముఖ్య అజెండా 1. వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించటం :2. గనుల క్వారీలను వడ్డెర్లకు లీజుకు ఇవ్వడం :3. కాంట్రాక్టు పనులలో 25% రిజర్వు చేయడం: అదే రోజు సాయంత్రం ముఖ్యమంత్రి ఇంటివద్ద వేలమంది వడ్డెర్లు కలిసి ధర్నా చేయడం జరిగింది , తెల్లవారుజామున 3 గంటలకు చంద్రబాబు నాయుడు ఇంటి నుండి బయటకు వచ్చి ఈరోజు మా కార్యాలయంలో మీ ఫైలు పై సంతకం చేసి ఎస్టీలుగా గుర్తించమని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని హామీ ఇచ్చిన తర్వాత నే ధర్నా ఆపాము. కానీ మాట ఇచ్చిన దాని ప్రకారం వడ్డెరలను ఎస్టీలుగా ప్రపోజ్ చేసి కేంద్రానికి చంద్రబాబు గారు పంపారు .కానీ కేంద్రం ఇప్పటివరకు పరిశీలించలేదు . కావున మనమందరం మళ్లీ ఒకసారి గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారిని కలిసి వడ్డెరలను ఎస్టీలుగా గుర్తించాలని ప్రపోజ్ కేంద్రానికి అందరం కలిసి చేయుద్దాం.

## 'రోజూ పలుమార్లు దేవుడిని ప్రార్థిస్తున్నాడని అత్యాచార కేసులో ఖైదీకి ఉరి శిక్ష రద్దు'.. హైకోర్టు విచిత్ర తీర్పు

ఒడిశా, జులై 2: ఒడిశా హైకోర్టు తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. ఆరేళ్ల బాలికపై హత్యాచారం కేసులో దోషిగా తేలిన ఓ ఖైదీకి మరణశిక్షను రద్దు చేసింది. అందుకు కోర్టు తెలిపిన కారణం విన్న ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. అసలేం జరిగిందంటే.. ఎస్కే ఆసిఫ్ అలీ (36) అనే వ్యక్తి ఆరేళ్ల బాలికను 2014లో అత్యాచారం చేసి, హత్య చేశాడు. ఈ కేసులో ఒడిశాలోని జగత్సింగ్పూర్లో ఉన్న పోక్సో కోర్టు మరణశిక్ష విధించింది. అయితే తాజాగా ఈ కేసును విచారించిన హైకోర్టు అతడికి విధించిన మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చింది. ఇందుకు సంబంధించి జూన్ 27న 106 పేజీల తీర్పును హైకోర్టు ఇచ్చింది. తీర్పు సమయంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

ఈ కేసులో దోషిగా తేలిన ఆసిఫ్ అలీ రోజూ దేవుణ్ని ప్రార్థిస్తున్నాడు. రోజులో ఎన్నోసార్లు నమాజ్ చేస్తున్నాడు. అతడు దేవుడి ముందు లొంగిపోయాడు. తాను చేసిన నేరాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. అందుకే అతడికి విధించిన మరణశిక్షను జీవితఖైదుగా మారుస్తున్నామని తీర్పు సమయంలో హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.అలాగే బాధిత బాలిక కుటుంబానికి రూ.1.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని పోక్సో కోర్టు ఆదేశించగా దాన్ని సవరించిన కోర్టు రూ.10 లక్షలు అందించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. తీర్పును రచించిన జస్టిస్ సాహూ.. అలీ మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చడానికి అదనపు కారణాలనూ జోడించారు. నిందితుడికి 63 యేళ్ల వయసున్న వృద్ధ తల్లి, ఇద్దరు అవివాహిత సోదరీమణులు ఉన్నారని.. వారంతా అతనిపైనే ఆధారపడ్డారని, అతని కుటుంబ ఆర్థికపరిస్థితి ఏమాత్రం బాగాలేదని వ్యాఖ్యానించింది. పైగా జైలులోనూ అతను సత్ప్రవర్తనతో ఉన్నాడని సమర్థించింది. ఈ మేరకు ట్రయల్ కోర్టులో ాఐ సాహూ, ఖీఐ పట్నాయక్లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పును వెలువరించింది.దీంతో హైకోర్టు తీర్పును ప్రతి ఒక్కరూ తప్పుబడుతున్నారు. ఒక ఖైదీ రోజుకు పలుసార్లు నమాజ్ చేసినంత మాత్రాన మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా ఎలా మార్చుతారంటూ పలువరు న్యాయవాదులు ప్రశ్నిస్తున్నారు

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757